
thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 19 | కరీంనగర్ | శనివారం | 4 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహమ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |



## అసమాన శాస్త్ర పరిశోధకుడు విలియం క్రూక్స్

ఏప్రిల్ 4...
విలియం క్రూక్స్ వర్ధంతి

6



# భారత నౌకాదళానికి మరో బలం

**ఎదురు కాల్పుల్లో 14 మంది నక్సల్స్ హతం**

- అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం
- విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- స్టెల్త్ సాంకేతికతతో రూపొందిన నూతన ఫ్రిగేట్
- బ్రహ్మోస్, బరాక్-8 క్షిపణులతో సన్నద్ధం
- అణు నిరోధక శక్తిలో భారత్‌కు మరో అడుగు

4



## కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

- డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్
- పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన

4

# టెక్స్‌టైల్‌రంగంలో తెలంగాణ అగ్రగామి

**ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం**



- చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ
- గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తాం
- ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 3:** తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్ టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్

మిగతా 2 లో

-రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి తిరుగుబాటు బాధలు ముదిరిపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అంటేనే రాజకీయ నాయకుల మధ్య విభేదాలు.. కలహాలు, అవమానాలు.. రోడ్డెక్కడం వంటివి చాలా కామన్. ఎమ్మెల్సీ సీనియర్ కాంగ్రెస్ వాది జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై అధిష్టానం పై తిరుగుబాటు చేసి ఆ పార్టీకి ఇటీవల రాజీనామా చేసింది విధితమే.జీవన్ రెడ్డి నిర్ణయంతో కలవరపడ్డ అధిష్టాన వర్గం, మంత్రులు సైతం జగిత్యాలకు చేరుకొని జీవన్ రెడ్డిని బుజ్జగించినప్పటికీ తన రాజీనామాను వెనక్కి తగ్గలేదు.దీంతో జీవన్ రెడ్డిని బతిమిలాడి బుజ్జగించిన వినకుండా ఆ పార్టీ నాయకత్వంతో పాటు ముఖ్యమంత్రి పైనే నిప్పులు చెరిగి సంచలనం సృష్టించారు.కాంగ్రెస్ పార్టీలో ,ఇటు ప్రభుత్వంపై ముఖ్యమంత్రిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేసిన జీవన్ రెడ్డి ఇప్పుడు తన వెంట పెద్ద గుంపును టీ ఆర్ ఎస్ కు తీసుకు వెళుతున్నట్టు సమాచారం.

మొహమ్మద్ ఇమ్రాన్
సీనియర్ జర్నలిస్ట్



## జీవన్ రెడ్డి దారిలో ధర్మపురి సంజయ్.!?

- కాంగ్రెస్ లో మరో తిరుగుబాటు తప్పదా.??
- ఉత్తర తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కలవరం

వివరాలు 4వ పేజీలో

# వరంగల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుపై ఏసీబీ పంజా!

- ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్ల నుంచి అక్రమాలపై ఆరా
- తనిఖీల్లో అక్రమ లావాదేవీలు, లంచాలు గుర్తింపు
- భారీగా నగదు, నగలు, అనేక డాక్యుమెంట్లు స్వాధీనం




వివరాలు 2వ పేజీలో

## గ్రూప్-1 నియామకాలపై సుప్రీం తీర్పు

ఎక్స్ వేదికగా స్వాగతించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2



## రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

RYTHU BHAROSA SCHEME

2



## రేవంత్ రెడ్డి దిగిపోవాలని ప్రజల ఆకాంక్ష

- కాంగ్రెస్ కు కాలం చెల్లింది
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- రెండేళ్లలోనే పాలనపై తీవ్ర వ్యతిరేకత
- 13న బీఆర్ఎస్‌లోకి మాజీ ఎమ్మెల్సీ!

3

## తెలంగాణలో ఏం చేశారని కేరళలో ప్రచారం?

ఆరు గ్యారంటీలపై పచ్చి అబద్ధాలు..
బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలి
రేవంత్ పై కిషన్ రెడ్డి ధ్వజం!

కేరళ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిలో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.



## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- నాడు మాట్లాడిన రేవంత్ ఇప్పుడు ఎందుకు మౌనం?
- టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత,

రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ మితిమీరిపోతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు.



3



## ఎస్టీల సంక్షేమంపై సర్కార్ నిర్లక్ష్యం!

సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

వివరాలు 2లో




# గ్రూప్-1 నియామకాలపై సుప్రీం తీర్పు


## ఎక్స్ వేదికగా స్వాగతించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 3:** తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. కొలువుల కోసం సంవత్సరాల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ -1 ఆశావహులకు ఇది పెద్ద ఊరటగా చెప్పుకొచ్చారు. ప్రజా ప్రభుత్వం వచ్చీ రావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ -1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని వెల్లడించారు. వారికి మరోసారి సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ట్వీట్ చేశారు.

# రెండో విడత రైతు భరోసాకు రంగం సిద్ధం

## పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం

### నిధులు సమకూర్చాలని సిఎం రేవంత్ ఆదేశం




**హైదరాబాద్,ఏప్రిల్3 :** తెలంగాణ రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే.. ఈ నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని, నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరం లోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

# తెలంగాణలో ఏం చేశారని కేరళలో ప్రచారం?

## బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలి : కిషన్ రెడ్డి ధ్వజం!



**హైదరాబాద్, ఏప్రిల్ 3 :** కేరళ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిలో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏమీ చేయకుండా కేరళలో ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. గతంలో కేసీఆర్ చేసిన తరహాలోనే రేవంత్ రెడ్డి కూడా ప్రజలను మోసం చేస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో అమలు చేయని పథకాలను కేరళలో అమలు చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. భవిష్యత్తులో తెలంగాణలోనూ ఇదే తరహా అబద్ధాలు చెప్పే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీసీలకు బీజేపీ అన్యాయం చేసిందని అనడంపై కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు బీసీల కోసం కాంగ్రెస్ ఏం చేసిందో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని దుయ్యబట్టారు. కేరళలో పచ్చి అబద్ధాలతో పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.

# టెక్స్‌టైల్‌రంగంలో తెలంగాణ అగ్రగామి

మొదటి పేజీ తరువాయి

డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెళి మా తొలి ప్రాధాన్యం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు.తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్ఎలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలు మూలల నుండి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పమన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, వేగవంతమైన అనుమతులతో పాటు ప్రపంచ స్థాయి విధానాలను మా ప్రభుత్వం అందిస్తుంని అంటూ హామీ ఇచ్చారు. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్' లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.





# ఎస్టీల సంక్షేమంపై సర్కార్ నిర్లక్ష్యం!



- రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్ దే
- ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వని దుస్థితి.. బడ్జెట్ నిధుల ఖర్చులో భారీ కోత
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

**నారాయణపేట, ఏప్రిల్ 3:** గిరిజనుల రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఆయన హాజరయ్యారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు ఆత్మగౌరవం కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

### గిరిజనులకు కాంగ్రెస్ చేసింది సున్నా

ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. బడ్జెట్ లో ఎస్టీలకు 2,730 కోట్లు కేటాయించి, కేవలం 50 కోట్లే ఖర్చు చేయడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆక్షేపించారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్ కు ప్రకటించిన 100 కోట్లు ఎక్కడ అని ప్రశ్నించారు. ఎస్టీల ఓట్లు కావాలి కానీ వారి సంక్షేమం పట్టదా అని నిలదీశారు.

### తెలంగాణలో దగా.. కేరళలో గొప్పలా?

రేవంత్‌రెడ్డి తెలంగాణలో లంబాడీలను దగా చేసి, కేరళలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు. లగచర్లలో లంబాడీల భూములు గుంజుకుని వారిని జైలులో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్ లో ఏ గ్రామంలోనైనా వంద శాతం రుణమాఫీ జరిగిందో చూపాలని సవాల్ విసిరారు. అక్కడ గ్రామసభల్లో ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు.

### పాలమూరు ఎత్తిపోతలపై నిర్లక్ష్యం

పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ కు పేరొస్తుందనే భయంతో ప్యాకేజీ-3 పనులను నిలిపివేశారని విమర్శించారు. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి పాలమూరు ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వల్ల పాలమూరు ప్రజలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# వరంగల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుపై ఏసీబీ పంజా!

- ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్ల నుంచి అక్రమాలపై ఆరా
- తనిఖీల్లో అక్రమ లావాదేవీలు, లంచాలు గుర్తింపు
- భారీగా నగదు, నగలు, అనేక డాక్యుమెంట్లు స్వాధీనం



**వరంగల్, ఏప్రిల్ 3:** వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, డాక్యుమెంట్లు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్-1 జమాలపురం రామనరసింహరావు, రిజిస్ట్రార్-2 దేవులూరి ఆనంద్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఇద్దరు అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన ఫోన్ పే పరిశీలించగా సుమారు రూ.42 లక్షలు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 70 రిజిస్ట్రేషన్ కాని డాక్యుమెంట్లను పరిశీలించారు. అదే విధంగా ఇద్దరు ఇళ్ల నుంచి రూ.24.61 లక్షల నగదును, 819.500 గ్రాముల బంగారు ఆభరణాలను, 2.600 కిలో గ్రాముల వెండి ఆభరణాలను, రూ.30 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదులు అందడంతో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్లయిన జమాల్పూర్ రామ్ నర్సింహారావు, దేవులూరి ఆనంద్ తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధికారికంగా డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. వీరిద్దరూ డాక్యుమెంట్ రైటర్లతో కలిసి రిజిస్ట్రేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం ఈ అనధికారిక రైటర్లు పంపిన పత్రాలను మాత్రమే వీరిద్దరు ప్రాధాన్యత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తేలింది. కార్యాలయంలో పూర్తి కాని సుమారు 70 డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాట్ ద్వారా బట్టబయల య్యాయి. గత ఏడాది కాలంలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ ఇద్దరు అధికారులు సుమారు రూ. 42 లక్షలను లంచంగా తీసుకున్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. కార్యాలయంలో సోదాల అనంతరం ఏసీబీ బృందాలు ఇద్దరి నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. వీరి ఇళ్లలో లక్షలాది రూపాయల నగదుతో పాటు భారీగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు కనుగొన్నారు. ఇక్కడ ఓ షాకింగ్ అంశం వెలుగులోకి వచ్చింది. ఓ అధికారి ఇంట్లో రిజిస్ట్రేషన్ చేయని 254 ప్రభుత్వ పత్రాలు లభించడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన పత్రాలు అధికారుల ఇళ్లలో ఎందుకు ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ ఇద్దరు అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు.

# జిహెచ్ఎంసికి భారీగా పెరిగిన ఆదాయం

## నిర్మాణ అనుమతులతో 1,172.08 కోట్ల రాబడి

**హైదరాబాద్,ఏప్రిల్3:** నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా జీహెచ్ఎంసీకి ఆదాయం పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.1,172.08 కోట్ల ఆదాయం వచ్చినట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. మొత్తం 2,427 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. కేవలం 2025 మార్చిలోనే 15,536 నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. మరోవైపు 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.1,138.44 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.34.36 కోట్ల మేర ఆదాయం పెరిగింది. బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా జీహెచ్ఎంసీ నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేసింది. మరోవైపు క్యూర్ అర్బన్ రీజియన్‌లో రూ.2,558.8 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. జీహెచ్ఎంసీలో రూ.995.82 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.1000.36 కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.562.62 కోట్ల మేర వసూలైంది. మార్చి నెలలో మొత్తం రూ.453.98 కోట్ల మేర పన్ను వసూలు కాగా.. 31న ఒక్క రోజే రూ.162.94 కోట్ల ఆస్తిపన్ను బకాయిలు వసూలైనట్లు అధికారులు వెల్లడించారు.



చురకలు







# అమరుడు కొమురయ్యకు కేసీఆర్ నివాళి

**హైదరాబాద్, ఏప్రిల్ 3 :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘన నివాళి అర్పించారు. ప్రజా వ్యతిరేక పాలనపై తెలంగాణ ప్రజల తిరుగుబాటుకు సంకేతంగా నిలిచిన కొమురయ్య అమరత్వం, నాటి రాచరిక పాలకుల నుంచి నేటి పాలకుల వరకు సాగుతున్న ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అనంతరం పదేళ్ల పాటు స్వయం పాలనను దేశానికే ఆదర్శంగా నిలబెట్టుకోవడంలో అమరుల త్యాగాల స్ఫూర్తి ఇమిడి ఉందని కేసీఆర్ అన్నారు. ఈ అభివృద్ధి పథంలో ప్రతి ఒక్కరి త్యాగం దాగి ఉందని గుర్తుచేశారు. తమ ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, రాజకీయ హక్కుల కోసం తెలంగాణ సబ్బండ కులాల పోరాటాన్ని పాలక ప్రభుత్వాలు గుర్తించాలని కేసీఆర్ పేర్కొన్నారు. రాజ్యాంగ పరమైన హక్కులను ప్రజలకు అందించగలిగిన నాడే దొడ్డి కొమురయ్య వంటి ఎందరో తెలంగాణ అమరులకు, త్యాగధనులకు నిజమైన ఘన నివాళి అర్పించినట్లవుతుందని స్పష్టం చేశారు.

# పర్యాటక రంగానికి కొత్త ఊపు!

**మంత్రిని కలిసిన స్పెషల్ సీఎస్, ఎండీ**

**మౌలిక వసతుల కల్పనపై ఫోకస్..నూతన ప్రాజెక్టులకు దిశానిర్దేశం**



**హైదరాబాద్, ఏప్రిల్ 3 :**

పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) ఎండీ పీ గౌతమి శుక్రవారం సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నూతన ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర పర్యాటక వైభవాన్ని చాటేలా ప్రణాళికలు ఉండాలని అధికారులను ఆదేశించారు.

# చెరువుల పునర్జీవనానికి శ్రీకారం!

**6 కోట్లతో రెండు చెరువుల అభివృద్ధి**

**పనులను ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ**

**అమృత్ 2.0 కింద సుందరీకరణ**

**నగర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం**



**వరంగల్, ఏప్రిల్ 3 :**

నగరంలోని చెరువుల పునర్జీవనం, సుందరీకరణే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమృత్ 2.0 పథకం కింద పబ్లిక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో సుమారు 6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం ప్రారంభించారు. దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సుగుట్టలోని రంగ సముద్రం చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. చెరువుల కట్టల బలోపేతం, ఇతర మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద పాల్గొన్నారు. వారితో పాటు కార్పొరేటర్లు సురేష్ జోషి, మరుపల్ల రవి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.

# స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- నాడు మాట్లాడిన రేవంత్ ఇప్పుడు ఎందుకు మౌనం?
- టి.ఆర్.ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత,

**హైదరాబాద్, ఏప్రిల్ 3 :**

రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ మితిమీరిపోతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా సెంట్రల్ సిలబస్ స్కూళ్లు 30 శాతం వరకు ఫీజులు పెంచి సామాన్యులను పీడిస్తున్నాయని తెలిపారు.



**ప్రభుత్వ వైఖరిపై విమర్శలు**

గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫీజుల నియంత్రణ చట్టం కోసం డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక అసెంబ్లీని నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ స్కూళ్ల ఆగడాలను అరికట్టకపోతే పాఠశాలల ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రులను ముఖ్యమంత్రి స్వయంగా ప్రారంభిస్తూ వారి దోపిడీని ప్రోత్సహిస్తున్నారా అని నిలదీశారు.

**రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు**

రాజకీయ అంశాలపై స్పందిస్తూ.. 'తెలంగాణ రాష్ట్ర సమితి' పేరు ప్రస్తుతం అందుబాటులో ఉందని, ఆ పేరును ఎవరైనా వాడుకోవచ్చని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాము ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల తోనే ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. బీ.ఆర్.ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని, త్వరలోనే పాత పేరు.. కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తామని వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.

# ఇసుక ఆదాయం మాఫియా పాలు!

- లెక్కలు తేల్చాలని మన్నె క్రిశాంక్ డిమాండ్
- కాంగ్రెస్ హయాంలో పెరిగిన ధరలు
- నిజాలు దాచడం సరికాదని హితవు

**హైదరాబాద్, ఏప్రిల్ 3:**

తెలంగాణలో ఇసుక తవ్వకాల ఆదాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వచ్చిన ఆదాయాన్ని వక్రీకరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఇసుక ఆదాయం కేవలం 39 కోట్లు ఉంటే, కేసీఆర్ నాయకత్వంలో అది 886 కోట్లకు చేరిందని గుర్తుచేశారు. అప్పట్లో టన్ను ఇసుక ధర 645 రూపాయలే ఉండేదని, ఇప్పుడు సాండ్ బజార్ పేరుతో 1600 రూపాయలకు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. సర్వీస్ చార్జీలు 3 రూపాయల నుంచి 100 రూపాయలకు పెంచినా ఆదాయం పెరగకపోవడం అనుమానాస్పదమన్నారు.

**మాఫియా హస్తం?**

తవ్వకాల సమయాన్ని పెంచినా, 24 గంటల రవాణాకు అనుమతిచ్చినా రాబడి రెట్టింపు కాలేదని.. ఈ సొమ్మంతా సాండ్ మాఫియా చేతుల్లోకి వెళ్తోందని ఆరోపించారు. పర్యావరణ నిబంధనలను కూడా గాలికి వదిలేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్ఓ గుర్రం మల్సూర్ గతంలో టీఎస్ఎండీసీ ఎండీగా పనిచేశారని, ఆయనకు వాస్తవాలు తెలుసని క్రిశాంక్ అన్నారు. ప్రభుత్వం చెబుతున్న తప్పుడు గణాంకాలపై మల్సూర్ వెంటనే స్పష్టత ఇవ్వాలని



డిమాండ్ చేశారు. ఇసుక ఆదాయంపై పారదర్శకంగా పూర్తి వివరాలు బయటపెట్టాలని హితవు పలికారు.

# వంద సీట్లు మావే.. ప్రతిపక్షాలకు కాలం చెల్లింది!

**బీఆర్ఎస్ లో ఆధిపత్య పోరు.. రోడ్డున పడ్డ పార్టీ**

**రాముడి పేరుతో బీజేపీ ఓట్ల రాజకీయం**

**సంక్షేమ పథకాలే కాంగ్రెస్ కు శ్రీరామరక్ష**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలనం**



**మంచిర్యాల, ఏప్రిల్ 3:**

తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి ఇక్కడ స్థానం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ పై ప్రజలకు నమ్మకం ఉందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్ లో ఇంటి గొడవలు**

బీఆర్ఎస్ లో అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరాయని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని.. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో ఆ పార్టీ పరిస్థితి రోడ్డున పడిందని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి కూడా రావడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబులు నిండాయని, వారు చేసిన అప్పులను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కడుతోందని మండిపడ్డారు.

**దేవుడి పేరుతో రాజకీయం**

ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. రాముడేమైనా బీజేపీ జ్ఞా రా అని ప్రశ్నించారు. కులం, మతం పేరుతో రాజకీయం చేసే ఆ పార్టీని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. గత 12 ఏళ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థలను కేంద్రం అమ్మేస్తోందని ఆరోపించారు.

**ప్రజా సంక్షేమమే ధ్యేయం**

సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా నడుస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని.. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు. ఇందిరా గాంధీ నుంచి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ నాయకులు పేదల కోసమే పని చేస్తున్నారని కొనియాడారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్, స్థానిక నేతలు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి దిగిపోవాలని ప్రజల ఆకాంక్ష

**కాంగ్రెస్ కు కాలం చెల్లింది • మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

**రెండేళ్లలోనే పాలనపై తీవ్ర వ్యతిరేకత**

**13న బీఆర్ఎస్ లోకి మాజీ ఎమ్మెల్సీ!**

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 3 :** బీసీలతో పాటు కురుమ, గొల్ల, యాదవులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మహబూబ్ నగర్ పట్టణంలో ఆయన విగ్రహానికి హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంఎల్ సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నివాళులు అర్పించారు.

**బడ్జెట్ నిధుల మళ్లింపు**

బీసీలకు బడ్జెట్ లో వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, కేవలం 7 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారని హరీశ్ రావు మండిపడ్డారు. ఈ విషయంలో అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీసినట్లు తెలిపారు. యాదవులకు గొర్రెల పంపిణీ, నగదు బదిలీ పథకాల విషయంలో కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. కనీసం మంత్రివర్గంలో కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని ఆక్షేపించారు. కేసీఆర్ హయాంలో కొమురయ్య జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు.

**బీసీ రిజర్వేషన్లపై మోసం**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు విద్య, ఉద్యోగాల్లో వారిని విస్మరించిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. గిరిజన, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

**పాలమూరు అభివృద్ధిపై చర్చ**

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ అభివృద్ధికి హరీశ్ రావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. గతంలో 14 రోజులకు ఒకసారి నీళ్లు వచ్చే పరిస్థితి ఉంటే, బీఆర్ఎస్ హయాంలో ప్రతిరోజూ నీళ్లు ఇచ్చామని చెప్పారు. రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు పాలమూరు ప్రాజెక్టు పనులను 90 శాతం పూర్తి చేశామని వివరించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.

# జీవన్ రెడ్డి దారిలో ధర్మపురి సంజయ్ .!?



**మొహమ్మద్ ఇమ్రాన్, సీనియర్ జర్నలిస్ట్ :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి తిరుగుబాటు బాధలు ముదిరి పోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అంటేనే రాజకీయ నాయకుల మధ్య విభేదాలు.. కలహాలు, అవమానాలు..రోడ్డెక్కడం వంటివి చాలా కామన్.ఎమ్మెల్సీ సీనియర్ కాంగ్రెస్ వాది జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై అధిష్టానం పై తిరుగుబాటు చేసి ఆ పార్టీకి ఇటీవల రాజీనామా చేసింది విధితమే.జీవన్ రెడ్డి నిర్ణయంతో కలవరపడ్డ అధిష్టాన వర్గం,మంత్రులు సైతం జగిత్యాలకు చేరుకొని జీవన్ రెడ్డిని బుజ్జగించినప్పటికీ తన రాజీనామాను వెనక్కి తగ్గలేదు.దీంతో జీవన్ రెడ్డి ని బతిమిలాడి బుజ్జగించిన వినకుండా ఆ పార్టీ నాయకత్వం తో పాటు ముఖ్యమంత్రి పైనే నిప్పులు చెరిగి సంచలనం సృష్టించారు.కాంగ్రెస్ పార్టీలో ,ఇటు ప్రభుత్వంపై ముఖ్యమంత్రిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేసిన జీవన్ రెడ్డి ఇప్పుడు తన వెంట పెద్ద గుంపును టీ ఆర్ ఎస్ కు తీసుకు వెళుతున్నట్టు సమాచారం.తెలంగాణ లో ప్రధానంగా ఉత్తర తెలంగాణకు చెందిన ప్రముఖులను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయించి తనతో పాటు టిఆర్ఎస్ వెంట గూటికి తీసుకు వెళ్ళేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి .ఈ మేరకు పిసిసి మాజీ అధ్యక్షులు డిఎస్ తనయుడు సంజయ్ కుమార్ తో సంప్రదింపులు జరిపి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే విధంగా ఒప్పిస్తున్నట్లు జీవన్ రెడ్డి ప్రయత్నాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి .ఉత్తర తెలంగాణ ప్రాంతంలో జీవన్ రెడ్డి ప్రభావం తీవ్రంగా ఉంటుందని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. జీవన్ రెడ్డి 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని అంటి ముట్టుకొని ఉంటూ వస్తున్నారు. కాంగ్రెస్ నాయకత్వం బలోపేతం కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకుడు కావడం వల్ల జీవన్ రెడ్డి నిర్ణయం కాంగ్రెస్ పార్టీ పైన ,ప్రభుత్వం పైన ప్రభావం చూపుతుందని అభిప్రాయ పడుతున్నారు .ఇప్పుడు ఆయన వెంట నిజాంబాద్ జిల్లాకు చెందిన మాజీ పీసీసీ అధ్యక్షుడు డి శ్రీనివాస్ తనయుడు సంజయ్ని సైతం వెంటేసుకుని వెళ్లడం నిజాంబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి గట్టి దెబ్బగా భావిస్తున్నారు .సంజయ్ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి అసెంబ్లీ టికెట్ కోసం ఆశించి బంగబడారు .తర్వాత నామినేటెడ్ పదవుల విషయంలో కూడా సంజయ్ కి తగిన ప్రాతినిధ్యం లభించకపోవడంతో ఆగ్రహంతో ఉంటున్న సంజయ్ ని జీవన్ రెడ్డి చేరదీసి ఇద్దరు కలిసి టిఆర్ఎస్ గూటికి వెళ్లేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం .ఇద్దరు నాయకుల ప్రయత్నాలు నిజమైతే కాంగ్రెస్ పార్టీకి తీవ్రంగా నష్టమేనని పలువురు అంటున్నారు .ఈ ఇద్దరు జీవన్ రెడ్డి సంజయ్లు ఇద్దరు కూడా నిజామాబాద్ పార్లమెంట్ ప్రాంతాన్ని ప్రభావితం చేసే నాయకులు కావడం ఆ ఇద్దరు ఇప్పుడు టిఆర్ఎస్ గూటికి వెళ్లడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఆనవాళ్లు కోల్పోవడం ఖాయమైనట్టున్నారు .ఒకటి రెండు రోజులుగా సంజయ్ గురించి పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతున్న సమయంలో అధిష్టాన వర్గం సంజయ్ ని దగ్గరికి తీసుకుని బుజ్జగిస్తుందా లేదా వదిలిపెడుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.!

### మావోయిస్టుపార్టీఅగ్రనేత 'ప్రశాంత్ బోస్ '(కిషన్ దా)

# జైల్లో కన్నుమూత



మావోయిస్టు టాప్ లీడర్ కిషన్ దా జైల్లో కన్నుమూశారు.పొలిట్ బ్యూరోలో ఉన్న ఆయన దశాబ్దాల కాలం పాటు అణగారిన వర్గాల విముక్తి కోసంపోరాడుతు న్నారు. ఆయన జీవిత సహచరిణితో పాటు అరెస్ట్ అయిన ఇద్దరు రాంచీ జైల్లో ఉన్నారు. శుక్రవారం ప్రశాంత్ బోస్ మరణం చెందారు. మాజీ మావోయిస్టు జంపన్న ఇచ్చిన వార్త ప్రకారం...శ్రామిక వర్గ రాజ్య స్థాపన కోసం తన జీవితాన్ని ధారపోసిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడు...సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ ప్రశాంత్ బోస్ (75) అలియాస్ కిషన్ దా జార్ఖండ్‌లోని రాంచీలో జైలు కస్టడీలో ఉండగా అనారోగ్యంతో ఏప్రిల్ 3, 2026 నాడు తుదిశ్వాస విడిచారు.శ్వాసకోశ ఇబ్బందులతో రాంచీలోని RIMS ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. నవంబర్ 12, 2021న జార్ఖండ్‌లోని సెరైకెలా-ఖర్సావాన్ జిల్లాలో తన భార్య షీలా మరాండీతో (మావోయిస్టు కేంద్ర కమిటీ మెంబర్)కలిసి పోలీసులకు అరెస్టు అయినారు.

పశ్చిమ బెంగాల్‌లోని ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ప్రశాంత్ బోస్, నాటి నక్సల్బరీ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. ఒక మేధావిగా, సిద్ధాంతకర్తగా ఆయనకు ఉన్న మేధస్సును సొంత ప్రయోజనాల కోసం కాకుండా, ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావాలనే లక్ష్యం కోసం వెచ్చించారు. సుఖవంతమైన జీవితాన్ని తృణీకరించి, దట్టమైన అరణ్యాల్లో, కటిక పేదరికం అనుభవిస్తున్న ప్రజల మధ్య ఉంటూ వారిని చైతన్యపరిచారు.

భారత విప్లవోద్యమ చరిత్రలో 2004 సెప్టెంబర్ 21 ఒక మైలురాయి. విడివిడిగా ఉన్న విప్లవ ధారలను (పీపుల్స్ వార్ మరియు ఎంసిసి) ఏకం చేసి, సిపిఐ (మావోయిస్టు) పార్టీని ఆవిర్భవింపజేయడంలో ప్రశాంత్ బోస్ పోషించిన పాత్ర చిరస్మరణీయం. ఒక విశాలమైన ఐక్య సంఘటనను నిర్మించడం, బలమైన ఎర్రసైన్యం నిర్మించడం ద్వారా దేశంలో వివిధ ప్రాంతాల్లో విముక్తి ప్రాంతాలు నిర్మించడం ద్వారా సామ్రాజ్యవాదాన్ని, ఫ్యూడల్ శక్తులను నిర్మూలించాలని దేశంలో నూతన ప్రజాస్వానికి విప్లవాన్ని విజయవంతం చేయాలని ఆ మార్గంలో పార్టీని నిర్మించి విస్తరించడానికి నాయకత్వం వహించినాడు. కామ్రేడ్ ప్రశాంత్ బోస్ పాలకుల అణచివేతను, దోపిడీని ఎండగడుతూ ఆయన రాసిన వ్యాసాలు, రూపొందించిన వ్యూహాలు అసంఖ్యాక విప్లవకారులకు దిశానిర్దేశం చేశాయి. డెబ్బై ఏళ్లు దాటిన వయసులో, అనారోగ్యం వెంటాడుతున్నా, జైలు గోడల మధ్య ఉన్నా ఆయన గుండెల్లో విప్లవ జ్వాల ఏనాడూ ఆరలేదు. ప్రజల కోసం, దేశ విముక్తి కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన ఇటువంటి నాయకులు చరిత్రలో అరుదుగా కనిపిస్తారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, ఆయన నడిచిన బాట ఈ దేశ శ్రామిక వర్గానికి ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. అణచివేత లేని సమాజం కోసం ఆయన కన్న కలలను నిజం చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

**(మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే రాసిన సంక్షిప్తమైన సమాచారం మాత్రమే)**
**భారత విప్లవ యోధుడు కామ్రేడ్ ప్రశాంత్ బోస్‌కు (కామ్రేడ్ కిషన్ దా) విప్లవ జోహార్లు!**

# భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

- అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం
- విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 3:** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ (ఎనిటతిజీని ఔజీలా) వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా



పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

# కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

- డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్
- పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన



**కువైట్ సిటీ, ఏప్రిల్ 3:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం కువైట్‌లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మినా అల్-అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొంది. ఈ దాడిలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో మినా అల్-అహ్మది ఒకటి. కువైట్ చమురు ఉత్పత్తికి ఇది చాలా కీలకం. మినా అల్-అహ్మది కర్మాగారం నుంచి రోజుకు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. దాదాపు లక్షల బ్యారెళ్ల మేర డీజిల్, ఇతర శుద్ధి చేసిన ఇంధనాలను ఆసియా, యూరప్‌లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ.. ప్రభుత్వానికి కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తోంది. ఈ కర్మాగారం లేకపోతే అక్కడ ఉత్పత్తి అయ్యే చమురును శుద్ధి చేయలేక బావులను మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి భారత్‌తో సహా ఇతర ప్రపంచదేశాలు చమురు దిగుమతి చేసుకుంటాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం భారత్.. కువైట్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసింది. జాతీయ ఆయిల్ కంపెనీపై డ్రోన్ దాడి జరిగినట్లు కువైట్ న్యూస్ ఏజన్సీ శుక్రవారం పేర్కొంది. దీంతో పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని తెలిపింది. ఉదయం మినా అల్-అహ్మదీ ర్గి÷నైరీ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ (కెపిసి) మీడియాకు తెలిపింది. ఫలితంగా పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. గల్ఫ్ భూభాగంపైకి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణవ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకుంటుందని కువైట్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సైరన్‌లు మోగుతున్నాయని బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించింది.

### రెండో ఎఫ్-35ను

# కూల్చేశాం: ఇరాన్

**అమెరికా ఆధునిక యుద్ధవిమానంపై సంచలన ప్రకటన**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** అమెరికా వాయుసేనకు చెందిన అత్యాధునిక ఎఫ్-35 యుద్ధవిమానాన్ని తమ గగనతలంలో కూల్చేశామని ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. తాజా ఘటనతో తమ చేతిలో కూలిన ఎఫ్-35ల సంఖ్య రెండుకు చేరిందని వెల్లడించింది. ఈ ఘటనలో విమానం పైలట్ తీవ్రంగా గాయపడినట్లు, అతడు ప్రాణాలతో బయటపడే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు ఇరాన్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ ప్రకటనపై యూఎస్‌సెంట్రల్ కమాండ్‌నుంచి ఎలాంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు. ఇరాన్ చేసిన ఈ ప్రకటన నిజమైతే అమెరికాకు ఇది పెద్ద ఎదురుదెబ్బగా మారనుంది. ప్రపంచంలో అత్యంత ఆధునిక యుద్ధవిమానాల్లో ఒకటైన ఎఫ్-35 లైటినింగ్2 తొలిసారి ప్రత్యక్ష యుద్ధంలో శత్రువుల దాడికి గురైనట్టు భావిస్తున్నారు. ఈ స్టెల్త్ యుద్ధవిమానం ఖరీదు 10 కోట్ల డాలర్లకు పైగా ఉంటుంది. స్టెల్త్ సాంకేతికత, అధునాతన సెన్సర్లు, నెట్‌వర్కింగ్ సామర్థ్యాలతో ఇది అమెరికా, దాని మిత్రదేశాల వాయుసేనకు కీలక భాగంగా నిలిచింది. ప్రస్తుతం 19 దేశాలు ఈ యుద్ధవిమానాన్ని వినియోగిస్తున్నాయి.

**జపాన్‌కు తోమహాక్ క్షిపణుల సరఫరా ఆలస్యం**

ఇదే సమయంలో జపాన్‌కు అమెరికా సరఫరా చేయాల్సిన తోమహాక్ క్షిపణుల డెలివరీ ఆలస్యమవుతున్నట్లు సమాచారం. వందల సంఖ్యలో క్షిపణుల కొనుగోలుకు గతంలో ఒప్పందం కుదిరినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సరఫరా ప్రభావితమైందని తెలుస్తోంది. ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరగడంతో అమెరికా తన సైనిక వనరులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నందున ఈ ఆలస్యం జరుగుతున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.

# మరో 3 రోజులు పార్లమెంట్

**16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం**

**మహిళా రిజర్వేషన్, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లులపై చర్చ**


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించితీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాత పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, మహిళా రిజర్వేషన్ చట్టం సత్వర అమలు వంటి కీలక బిల్లుల కోసం మూడురోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయని, ఈ విషయాన్ని విపక్షాలకు ప్రభుత్వం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ కోటా అమలు బిల్లుపై, జనగణనతో నియోజకవర్గాల పునర్విభజనకు ఉన్న లంకెను విడదీయడంపై విపక్షంతో ప్రభుత్వం లోపాయికారీ సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్‌ల)కు ఒకే విధమైన ఉద్యోగ నిబంధనలు ఉండేందుకు ప్రతిపాదించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభ ఆమోదించి పంపిన ఈ బిల్లును లోక్‌సభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది.

# అసమాన శాస్త్ర పరిశోధకుడు విలియం క్రూక్స్

విలియం క్రూక్స్ ప్రఖ్యాత బ్రిటిష్ భౌతిక, రసాయన శాస్త్రవేత్త. క్రూక్స్ రేడియో వికిరణ మాపకం ఆవిష్కర్త. అయన ఉత్సర్గ నాళం రూపకల్పనకు మార్గదర్శి. థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. రాయల్ కాలేజ్ ఆఫ్ కెమిస్ట్రీ, లండన్ లో వర్ణపట శాస్త్రం పై విస్తృత పరిశోధనలు చేశాడు. ఆయన తయారుచేసిన ఉత్సర్గ నాళాన్ని క్రూక్స్ నాళం అనికూడా అంటారు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలేనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొన బడ్డాయి. ఆయన కేంద్రక రేడియో ధార్మికతను అధ్యయనం చేయుటకు ఉపయోగించే పరికరం ను కనుగొన్నాడు. పదార్థం యొక్క స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

క్రూక్స్ తన జీవన గమనంలో ఒక అంతరిక్ష శాస్త్రవేత్తగా, ఉపన్యాసకునిగా వివిధ ప్రాంతాలలో పనిచేశాడు. భౌతిక, రసాయన శాస్త్రాలలో అనేక పరిశోధనలు చేశాడు. తన పరిశోధన ముఖ్య లక్షణము ప్రయోగముల ద్వారా వివిధ భావనలను, వాస్తవాలను కనుగొనుటగా భావించాడు. ఆయన అభిరుచు లయిన అనువర్తిత భౌతిక శాస్త్రము, ఆర్థిక, ప్రాయోగిక సమస్యలు, మానసిక సంబంధమైన పరిశోధనలు, ఆయనను ఉన్నత వ్యక్తిగా నిలిపింది. ఆయన అనేక అవార్డులు, గౌరవాలను పొందాడు. ఆయన జీవితం ఒక అసాధారణ శాస్త్రీయ కృత్యాలలతో మమేకం అయింది.

సర్ విలియం క్రూక్స్ లండన్ లో 1గ32 జూన్ 17 లో జన్మించాడు. 1గ50 నుండి 1గ54 మధ్య కాలంలో ఆయన కళాశాలలో సహాయకునిగా పనిచేశాడు. అనతి కాలంలో ఆయన కర్బన రసాయన శాస్త్రంలో కాకుండా ఆయనకు ఇష్టమైన రంగంలో ఆయన గురువు విల్‌హెల్మ్ వోన్ హోఫ్మాన్స్ ప్రేరణతో ప్రవేశించాడు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలేనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొన బడ్డాయి. ఆయన మొదటి పరిశోధనా పత్రాలను 1గ51 లో ప్రచురించాడు. ఆయన ఆక్స్‌ఫర్డ్ లో రాడ్‌క్లిఫ్ అబ్సర్వేటరీ విభాగంలో 1గ54 లో, ఛెస్టెర్ డియోసియన్ ట్రయినింగ్ కళాశాలలో 1గ55లో ఉపన్యాసకునిగా పనిచేశాడు. 1గ59 లో ఆయన కెమికల్ న్యూస్ అనే విజ్ఞానశాస్త్ర పత్రికను ప్రారంభించాడు. అనేక సంవత్సరాలు ఆ పత్రికలో వివిధ మార్పులు చేస్తూ నిర్వహించి అన్ని విజ్ఞాన శాస్త్ర జర్నల్స్ లో అగ్రగామిగా నిలిపాడు.



1గ61 లో క్రూక్స్ థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. ఈ మూలకం వర్ణపటంలో ఆకుపచ్చని కాంతిని ఉద్గారం చేయుటను గమనించాడు. గ్రీకు భాషలో థల్లోస్ అంటే ఆకుపచ్చని ఉద్గారం అని అర్థము. అలా దానికి థాలియం అని నామకరణం చేశాడు. క్రూక్స్ 1గ71 లో అనే ప్రామాణిక గ్రంథాన్ని రచించాడు. ప్రముఖ శాస్త్రవేత్తలైన బున్సెన్, కిర్కాఫ్లు ప్రవేశపెట్టిన వర్ణపట విశ్లేషణ పద్ధతిని ఉపయోగించి క్రూక్స్ అత్యంత ఉత్సుకతతో పరిశోధనలు కొన సాగించాడు. థాలియంను వర్ణపట విశ్లేషణ సహాయంతో కనుగొన్నాడు. ఆ నూతన ఆవిష్కరణ ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చి తెచ్చింది. ఆయన 1గ63 లో రాయల్ సొసైటీకి ఫెలోగా ఎంపికయ్యాడు.

ఆయన క్రూక్స్ నాళంను అభివృద్ధి చేశాడు. తద్వారా ఋణధృవ కిరణాల ఆవిష్కరణ జరిగింది. ఆయన అనేక పరిశోధనా పత్రాలను వర్ణపట శాస్త్రం పై ప్రచురించాడు. అల్ప పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింపజేయు పరిశోధనలలో ఆయన అతి తక్కువ పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింప జేసినపుడు ఋణ ధృవం (కాథోడ్) నుండి కొన్ని కిరణాలు ఉద్గారమగు చున్నట్లు కనుగొన్నాడు. వాటికి “ఋణధృవ కిరణాలు“ అని పిలిచాడు. యివి ప్రస్తుతం స్వేచ్ఛా ఎలక్ట్రాన్ల ప్రవాహంగా పిలువ బడు తున్నాయి. ప్రస్తుతం ఇవి కాథోడ్ కిరణ నాళాలలో ఉపయోగ పడుతున్నాయి. ఈ ఉదాహరణల నుండి ఆయన భౌతిక దృగ్విషయాలను అధ్యయనం చేయుటకు ఉపయోగపడే ఉత్సర్గ నాళాల తయారీలో ప్రసిద్ధి పొందాడు. 1గ79 లో ఆయన పదార్థం యొక్క స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. ఆయన కేంద్రక రేడియో ధార్మికతను అధ్యయనం చేయుటకు ఉపయోగించే పరికరం కనుగొన్నాడు.

క్రూక్స్ ఋణధృవ కిరణాలు లక్షణాలపై పరిశోధనలు చేశాడు. అవి ఋజుమార్గంలో ప్రయాణిస్తాయని, అవి వస్తువులపై పడినపుడు ప్రతిదీప్తిని కలుగ జేస్తాయని కనుగొన్నాడు. పదార్థంలో నాల్గవ స్థితి అయిన “ప్లాస్మా“ స్థితిని ఆయన కనుగొన్నాడు. దానికి “రేడియంట్ మేటర్“ అని పిలిచాడు. ఋణ ధృవ కిరణాలు అనేవి కొన్ని కణాల ప్రవాహమని నమ్మాడు. ఆ తర్వాత జె.జె.థామ్సన్ వాటిని కనుగొనడానికి భూమికను ఏర్పరచాడు. కాథోడ్ కిరణాలలో గల కణాలకు ఎలక్ట్రాన్ లుగా గుర్తించాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. దీని ఫలితంగా పరమాణువులో కొత్త కణాల ఆవిష్కరణకు మార్గం సుగమమైంది.

1గగ0 తర్వాత క్రూక్స్ ప్రైవేటు ప్రయోగ శాలలో తన పరిశోధనలను చేశాడు. 1గ95 లో విలియం క్రూక్స్ హీలియం నమూనాను గుర్తించాడు. 1903 లో ఆయన తన దృష్టిని రేడియో ధార్మికత దృగ్విషయాలపై నిలిపాడు. యురేనియం –ఙ (తర్వాత ప్రొటాక్టీనియంగా పిలువ బడుతున్నది. యురేనియాన్ని రేడియో ధార్మిక పరివర్తన ఆధారంగా వేరుచేయ గలిగాడు. ఉత్తేజిత పరివర్తన ఆధారంగా యురేనియం నుండి రేడియో ధార్మిక విఘటనాన్ని గమనించాడు. అదే సమయంలో ఆయన రేడియో ధార్మిక పదార్థం నుండి వెలువడే “జూ–కణముల“ను కనుగొన్నాడు. ఈ కణాలు జింక్ సల్ఫైడ్ తెరను ప్రభావితం చేయుట గమనించాడు. క్రూక్స్ 1909 లో “డైమండ్స్“ అనే చిన్న పుస్తకాన్ని రాశాడు. 1910 లో క్రూక్స్ “ఆర్డర్ ఆఫ్ మెరిట్“ను పొందాడు. ఆయన తన భార్య మరణానంతరం 2 సంవత్సరాల తర్వాత లండన్ లో 4 ఏప్రిల్ 1919 లో మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
-9440595494




# గనుల ముప్పు.. అవగాహనే రక్ష!

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని 2005లో ప్రారంభించింది. యుద్ధాలు, సాయుధ పోరాటాలు ముగిసిన తర్వాత కూడా భూమిలో మిగిలి పోయిన మందు పాతరలు, పేలుడు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. అంతే కాకుండా, వీటిని నిర్మూలించ డానికి జరుగుతున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం, బాధితులకు సహాయం అందించడం కూడా ఈ దినోత్సవం లక్ష్యాలలో ముఖ్యమైనవి.

యుద్ధాలు ముగిసిన తరువాత కూడా మందుపాతరలు ఒక పెద్ద సమస్యగా మిగిలి పోతాయి. ఇవి పొలాలు, రహదారులు, నివాస ప్రాంతాలు ఇలా ఎక్కడైనా ఉండవచ్చు. వీటి గురించి తెలియని సామాన్య ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, రైతులు, పేదవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మందు పాతర పేలినప్పుడు ప్రాణనష్టం జరగవచ్చు లేదా శాశ్వత వైకల్యం సంభవించవచ్చు. అంతే కాకుండా, ఇది దేశాల ఆర్థికాభివృద్ధికి కూడా ఆటంకం కలిగిస్తుంది. వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారతాయి, రవాణా వ్యవస్థ స్తంభించి పోతుంది, ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం ప్రధాన లక్ష్యాలలో...మందు పాతరల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, మందు పాతరల నిర్మూలనకు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రాజెక్టులకు ఆర్థికంగా, ఇతర విధాలుగా మద్దతు అందించడం, మందు పాతరల బాధితులకు అవసరమైన వైద్య సహాయం, మానసిక మద్దతు, పునరావాస సౌకర్యాలు కల్పించడం, మందు పాతరల సమస్య యొక్క తీవ్రతను తెలియ జేయడం, దీని పరిష్కారానికి అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం.

ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వీటిలో కొన్ని ముఖ్యమైనవి... మందు పాతరల ప్రమాదాల గురించి అవగాహన కల్పించే ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనకు సంబంధించిన విషయాలపై చర్చాగోష్ఠులు సెమినార్లు ఏర్పాటు చేయడం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనలో పాల్గొనే వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం. మందు పాతరల బాధితులకు మానసిక మరియు వైద్య సహాయం అందించడం, వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం. మందుపాతరల సమస్యపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి మీడియా ప్రచారం నిర్వహించడం.

భారత దేశంలో కూడా సరిహద్దు ప్రాంతాలలో మందు పాతరల సమస్య ఉంది. భారత సైన్యం ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో కీలకమైన పాత్ర పోషిస్తోంది. అయితే, ఈ సమస్య తీవ్రతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మందు పాతరల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

మరోవైపు, గనుల తవ్వకం కూడా పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. గనుల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. అంతే కాకుండా, గనుల కోసం అడవులను నరకడం వల్ల వన్య ప్రాణులు వాటి ఆవాసాలను కోల్పోతాయి. జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతుంది. గనులలో పనిచేసే కార్మికులకు కూడా ఆరోగ్య సమస్యలు మరియు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి, గనుల తవ్వకం విషయంలో పర్యావరణ హిత విధానాలను అనుసరించడం, కార్మికుల భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం.

అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం కేవలం ఒక రోజుకు మాత్రమే పరిమితం కాకూడదు. మందు పాతరల సమస్య తీవ్రతను గుర్తించి, దీనిని నిర్మూలించ డానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. బాధితులకు సహాయం అందించడానికి ముందుకు రావాలి. భవిష్యత్ తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించడమే మనందరి లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మందుపాతరల గురించి అవగాహన పెంచుకోవడం, ఈ సమస్యపై పోరాడటానికి కలిసి రావడం చాలా అవసరం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రోగనిరోధక శక్తికి రక్షాకవచం.. విటమిన్ సి

విటమిన్ సి, లేదా ఆస్కార్బిక్ ఆమ్లం, ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ మరియు అనేక శారీరక ప్రక్రియలకు అవసరమైన పోషకం. శరీరం దీనిని స్వంతంగా ఉత్పత్తి చేయలేదు కాబట్టి, మనం తీసుకునే ఆహారం ద్వారా లేదా సప్లిమెంట్ల ద్వారా దీనిని పొందాలి.

విటమిన్ సి యొక్క విస్తృత ప్రయోజనాలలో... రోగనిరోధక శక్తిని పెంచడం ద్వారా విటమిన్ సి తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, వాటి పనితీరును కూడా మెరుగు పరుస్తుంది. ఇవి శరీరంలోకి ప్రవేశించే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడటానికి సహాయ పడతాయి. అంతే కాకుండా, విటమిన్ సి యాంటీబాడీల ఉత్పత్తికి కూడా తోడ్పడుతుంది, ఇవి ఇన్ఫెక్షన్లను గుర్తించి నాశనం చేస్తాయి.

కొలాజెన్ ఉత్పత్తిలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుంది. కొలాజెన్ అనేది చర్మం, ఎముకలు, కండరాలు, రక్త నాళాలు, ఇతర కణ జాలాలను కలిపి ఉంచే ఒక ప్రోటీన్. గాయాలు త్వరగా మానడానికి మరియు కొత్త కణజాలం ఏర్పడటానికి ఇది చాలా అవసరం. విటమిన్ సి రక్తపోటును తగ్గించడంలో సహాయ పడుతుంది. రక్త నాళాల పనితీరును మెరుగు పరుస్తుంది. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కూడా కొంత పాత్ర పోషిస్తుంది, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

విటమిన్ సి ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ కావడం వల్ల, ఇది శరీరంలోని కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి రక్షిస్తుంది. ఈ ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక






ప్రతీ ఏటా ఏప్రిల్ 4న జాతీయ విటమిన్ సి దినోత్సవం జరుపు కుంటారు. ఈ దినోత్సవం ఆరోగ్యానికి విటమిన్ సి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియ జేయడం, దాని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయడం లక్ష్యంగా ఏర్పాటైంది. విటమిన్ సి అనేది శరీరానికి అత్యవసరమైన పోషక పదార్థం, ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటం మరియు కణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

వ్యాధులకు కారణ మవుతాయి. కొన్ని అధ్యయనాలు విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని సూచిస్తున్నాయి.

విటమిన్ సి మెదడు పనితీరుకు కూడా అవసరం. ఇది న్యూరో ట్రాన్స్‌మిటర్ల ఉత్పత్తిలో పాల్గొంటుంది, ఇవి మానసిక స్థితి, అభిజ్ఞా పనితీరును ప్రభావితం చేస్తాయి. కొన్ని పరిశోధనలు విటమిన్ సి మానసిక ఒత్తిడిని తగ్గించడంలో, మానసిక స్థితిని మెరుగు పరచడంలో సహాయ పడుతుందని సూచిస్తున్నాయి.

వయస్సు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యల్లో మచ్చల క్షీణత ఒకటి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లతో కలిసి, ఈ సమస్యను నివారించడంలో లేదా ఆలస్యం చేయడంలో సహాయ పడుతుంది.

కొన్ని అధ్యయనాలు విటమిన్ సి ఆస్తమా లక్షణాలను తగ్గించడంలో సహాయ పడుతుందని సూచిస్తున్నాయి, ముఖ్యంగా పిల్లలలో. ఇది శ్వాస నాళాల్లోని వాపును తగ్గించడంలో సహాయ పడుతుంది.

విటమిన్ సి లోపం వల్ల స్కర్వీ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. అయితే, స్వల్పకాలిక లోపం కూడా అలసట, బలహీనత, చిగుళ్ళ వాపు మరియు రక్తస్రావం, చర్మంపై దద్దుర్లు వంటి సమస్యలకు దారితీస్తుంది. ఆహారంలో తగినంత విటమిన్ సి లేకపోవడం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది, దీని వలన తరచుగా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.

విటమిన్ సి పుష్కలంగా లభించే ఆహారాలు చాలా ఉన్నాయి. నారింజ, నిమ్మ, ద్రాక్షపండు, బత్తాయి, బెర్రీలు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్‌బెర్రీలు, బ్రోకలీ, క్యాప్సికం (ముఖ్యంగా ఎరుపు మరియు పసుపు), బంగాళా దుంపలు, టమోటాలు, పాలకూర, క్యాబేజీ, కివి, మామిడి, బొప్పాయి, పుచ్చకాయ.

విటమిన్ సి నీటిలో కరిగే విటమిన్ కాబట్టి, వంట చేసేటప్పుడు కొంత మొత్తం కోల్పోయే అవకాశం ఉంది. అందువల్ల, పండ్లను మరియు కూరగాయలను పచ్చిగా తినడం లేదా తక్కువ నీటిలో తక్కువ సమయం ఉడికించడం మంచిది.

జాతీయ విటమిన్ సి దినోత్సవం మన ఆరోగ్యానికి ఈ ముఖ్యమైన పోషకం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడం నుండి కణజాల మరమ్మత్తు వరకు అనేక కీలకమైన విధులను నిర్వహిస్తుంది. మన ఆహారంలో విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు మరియు కూరగాయలను చేర్చుకోవడం ద్వారా మనం ఆరోగ్యకరమైన మరియు శక్తివంతమైన జీవితాన్ని గడపవచ్చు. ఈ రోజున, విటమిన్ సి ప్రయోజనాలను గుర్తించి, మన రోజువారీ ఆహారంలో దానిని చేర్చుకోవడానికి ప్రయత్నిద్దాం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్,
9440595494

# కొమురయ్య త్యాగం చిరస్మరణీయం!

- రైతుల హక్కుల పోరాట యోధుడికి నివాళి
- సామాజిక న్యాయమే కొమురయ్యకు ఇచ్చే గౌరవం
- యువతకు స్ఫూర్తిదాయకం ఆయన జీవితం
- సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహ




**సంగారెడ్డి, ఏప్రిల్ 3 :**

దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రైతుల హక్కుల కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన ధైర్యసాహసాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. పోతిరెడ్డిపల్లిలోని కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం కొమురయ్య చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగాలని సూచించారు. మహనీయుల ఆశయాలను సాకారం చేయడం ద్వారానే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

### యువతకు స్ఫూర్తి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ ఉద్యమానికి నాంది పలికిన అమరవీరుడు కొమురయ్య అని ప్రశంసించారు. యువత ఆయన జీవితం నుంచి ప్రేరణ పొంది సమాజానికి సేవ చేయాలని కోరారు. సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్ పర్సన్లు కూన వనిత, సుమలత శ్రీకాంత్ పాల్గొన్నారు. బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు, బీసీ సంఘం యూత్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బాసర అభివృద్ధికి సర్కార్ మొగ్గు!

- ఈ నెల 6న సీఎం పర్యటన
- ఏర్పాట్లు పర్యవేక్షించిన సుదర్శన్ రెడ్డి
- భక్తులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం
- అధికారుల సమన్వయంతో పనులు పూర్తి చేయాలి



**బాసర, ఏప్రిల్ 3 :**

ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర పర్యటనను పురస్కరించుకుని ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ఉర్దూ ఆకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ తో కలిసి బాసరలో పర్యటించారు. ముందుగా బాసరకు చేరుకున్న సుదర్శన్ రెడ్డికి కలెక్టర్ అభిలాష అభినవ్ స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ముఖ్యమంత్రి పూజలు చేసే ప్రాంతం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే స్థలాలను వారు పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఆలయ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు పాల్గొన్నారు. తహసిల్దార్ పవన్ చంద్ర, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తితో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# రైతుల పోరాటానికి సబితమ్మ మద్దతు!

- పరిగిలో 11వ రోజుకు చేరిన రిలే దీక్షలు
- భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల గళం
- మీ వెంటే మేమంటూ బీఆర్ఎస్ హామీ
- అధైర్యపడకండి.. అండగా ఉంటామన్న సబితారెడ్డి



**పరిగి, ఏప్రిల్ 3 :**

ఇండస్ట్రియల్ పార్కు పేరుతో భూములు సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన పోరాటం 11వ రోజుకు చేరింది. కడ్లాపూర్, రాపోల్ గ్రామాల్లో 1200 ఎకరాల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించాలని చూడటాన్ని నిరసిస్తూ రైతులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. శుక్రవారం వీరికి మద్దతుగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సంఘీభావం తెలిపారు. రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుందని సబితా ఇంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. "మీ కోసం మేము కూడా మీ పోరాటంలో భాగమై ఆసరాగా ఉంటాం.. అన్ని రకాలుగా అండగా నిలుస్తాం" అని ఆమె పేర్కొన్నారు. మీ భూములు తీసుకోకుండా చివరి వరకు పోరాటం చేద్దామని రైతులకు పిలుపునిచ్చారు. అభివృద్ధి పేరిట పేద రైతుల భూములను లాక్కోవడం సరికాదని మహేష్ రెడ్డి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాపోల్, కడ్లాపూర్ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. తమ భూములను కాపాడుకునే వరకు దీక్షలు విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు.

# జీహెచ్ఎంసీ భవన అనుమతుల జోరు!

**17,957 నిర్మాణ, లేఅవుట్ అనుమతులు**

**బిల్డ్ నౌ పోర్టల్ తో వేగవంతమైన సేవలు**

**ఖజానాకు 1,172 కోట్ల భారీ ఆదాయం**

**హైదరాబాద్, ఏప్రిల్ 3 :**

భవన అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు, లేఅవుట్ అనుమతులను బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా జీహెచ్ఎంసీ విజయవంతంగా మంజూరు చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గణాంకాలను శుక్రవారం అధికారులు విడుదల చేశారు. ముఖ్యమంత్రి మార్చి 2025లో ప్రారంభించిన ఈ పోర్టల్ ద్వారా అనుమతుల ప్రక్రియలో వేగం, పారదర్శకత పెరిగినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ల ద్వారా 1,172.08 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. క్రితం ఏడాదితో పోలిస్తే రాబడి పెరగడం గమనార్హం. ఇందులో సీఎంసీ 538.09 కోట్లు, జీహెచ్ఎంసీ 436.47 కోట్లు, ఎంఎంసీ 198.24 కోట్ల ఆదాయం వసూలు చేశాయి. ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్, ఇన్‌స్టంట్ అప్రూవల్, సింగిల్ విండో విధానాల్లో దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేశారు.

మొత్తం 15,536 నిర్మాణ అనుమతులు మంజూరు కాగా, వాటిలో అత్యధికంగా 12,014 ఇన్‌స్టంట్ అప్రూవల్ కింద జారీ అయ్యాయి. సింగిల్ విండో విధానంలో 2,515, ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్ కింద 972 అనుమతులు ఇచ్చారు. అదనంగా 29 లేఅవుట్ అనుమతులు, 2,427 ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు జారీ చేసినట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది. బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, దరఖాస్తుదారులకు నేరుగా సేవలు అందుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల పారదర్శకత పెరగడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని వివరించారు.

# చైతన్యంతోనే రాజ్యాధికారం సాధ్యం!

**డబ్బు రాజకీయాలను తిప్పికొట్టాలి**

**ఎల్బీనగర్ లో కొమురయ్య విగ్రహావిష్కరణ**

**బీసీల ఐక్యతపై మధుయాష్కి గౌడ్ పిలుపు**

**బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బీసీలకు అన్యాయం**



**ఎల్బీనగర్, ఏప్రిల్ 3 :**

ఐక్యత, చైతన్యం ద్వారానే బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగగలరని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు ఆయన హాజరయ్యారు. కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### డబ్బు రాజకీయాలను ఎదుర్కోవాలి

అనంతరం జరిగిన సమావేశంలో మధుయాష్కి మాట్లాడుతూ.. నిజాం అరాచక పాలన, దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన కొమురయ్య స్ఫూర్తితో బహుజనులు రాజకీయంగా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాజకీయాలు డబ్బుమయమయ్యాయని, ఆర్థికంగా ఎదుర్కొనే స్తోమత లేకపోయినా చైతన్యం ద్వారా రాజ్యాధికారం సాధించవచ్చని సూచించారు. తెలంగాణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయి అన్ని విధాలా నష్టపోయింది బీసీలేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం వచ్చాక కూడా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీలకు గొర్రెలు, బండ్లు ఇచ్చి పాలకులు మాత్రం వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు.

### కుల సంఘాల బలోపేతం

కుల సంఘాల్లోని దోపిడీదారులను గుర్తించి పక్కన పెట్టినప్పుడే సంఘం బలపడుతుందని మధుయాష్కి తెలిపారు. కుల సంఘాల భవనాలను కార్పొరేట్ విద్యాసంస్థలకు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాపార ధోరణిని అడ్డుకోవాలని కోరారు. గతంలో నగరంలో కల్లు దుకాణాల మూసివేతపై తాను చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. చైతన్యం లేకనే బీసీలు ఎన్నికల్లో గెలవలేకపోతున్నారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ కురుమ, ఎల్బీనగర్ అధ్యక్షుడు మల్లేష్ కురుమ పాల్గొన్నారు. వారితో పాటు బీసీ యువజన సంఘం నేత శ్యాం కురుమ, రవికుమార్, ఐలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అశోక్ గౌడ్, రామారావు, సత్యనారాయణ హాజరయ్యారు. వివిధ డివిజన్ల అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, రేణు గౌడ్, శరత్ యాదవ్ తో పాటు కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిప్పిరి సభకు సర్వం సిద్ధం!

**ఈ నెల 6న సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ**

**1200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన**

**బాసర అభివృద్ధికి 300 కోట్లు.. పుష్కరాలకు 500 కోట్లు**

**మంత్రులు జూపల్లి, వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాట్ల పరిశీలన**



**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 :**

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ఈ నెల 6న నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, ప్రేమ్ సాగర్ రావుతో కలిసి ఆయన సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. బోథ్ నియోజకవర్గంలో సుమారు 1200 కోట్ల వ్యయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. వీటిని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి జూపల్లి వెల్లడించారు. అలాగే బాసర సరస్వతి ఆలయ అభివృద్ధికి 300 కోట్లు, 2027 గోదావరి పుష్కరాల కోసం కుంభమేళా తరహాలో 500 కోట్లతో ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 600 కోట్ల విలువైన ఇతర అభివృద్ధి పనులకు కూడా శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, తాగునీరు వంటి సౌకర్యాల్లో ఎక్కడా లోటుపాట్లు ఉండకూడదని మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. పిప్పిరి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మంజూరైతే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. 6న మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి పిప్రి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సభా ప్రాంగణంలో శిలాఫలకాల ఆవిష్కరణతో పాటు లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ జరుగుతుందని వివరించారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కులు, సీఎం కప్ అవార్డులు, గ్రామ పంచాయతీలకు ఐఎస్ఓ సర్టిఫికేషన్లు అందజేయనున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో యువరాజ్ మర్మాట్ తో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కమిషన్ పెంపుతో మీ సేవ ఆపరేటర్ల హర్షం

▪ కొత్త సిటిజన్ చార్టర్ అమలు




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 3 :**

నిజామాబాద్ జిల్లాలో మీ సేవ ఆపరేటర్లకు ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. కమిషన్ పెంపుతో పాటు కొత్త సిటిజన్ చార్టర్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. ఈ నిర్ణయంపై జిల్లా మీ సేవ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని మీ సేవ ఆపరేటర్లకు చెందిన టీఎంఓసిఏ, ఏఎంసిఓఏ యూనియన్లు గత సంవత్సరం జేఏసీగా ఏర్పడి, కమిషన్ పెంపు కోసం గత పది సంవత్సరాలుగా కమిషనర్, ఐటీ కార్యదర్శి, ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం వారి సమస్యలను గుర్తించి మీ సేవ సేవలపై కమిషన్ పెంచుతూ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కమిషన్ పెంపుకు సహకరించిన జిల్లా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మీ సేవ కమిషనర్ రవి కిరణ్‌లకు యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పెరిగిన కమిషన్ ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. అదే రోజు నుంచి కొత్త సిటిజన్ చార్టర్ కూడా అమలులోకి వచ్చిందన్నారు. ఏప్రిల్ 3 రాత్రి 8 గంటల నుంచి ఏప్రిల్ 5 ఉదయం 8 గంటల వరకు సాంకేతిక కారణాల వల్ల సేవల్లో అంతరాయం ఉండవచ్చని, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వం సమస్యలను గుర్తించి కమిషన్ పెంచడం సంతోషకరమని, భవిష్యత్తులో కూడా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఎంసిఓఏ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల శ్రీనివాస్, టీఎంఓసిఏ జిల్లా అధ్యక్షుడు కే లక్ష్మీనారాయణ, పెద్దోళ్ల కిషోర్, ధర్మానందం, జీవిఆర్, శివకుమార్, విశ్వనాథ్, సంతోష్, మహమ్మద్ నజీర్ అహ్మద్, సయ్యద్ ఉబేద్ హైమద్, చింత రాజు, పెద్దోళ్ల రమేశ్వర్, తిరుపతి, పి శివకుమార్, పల్లికొండ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## అత్యవసరానికి స్పందించిన పాత్రికేయుడు పడిగేల నాగరాజు

**బోథ్(సోనాల), ఏప్రిల్ 3 :**

సోనాల మండల కేంద్రానికి చెందిన ఎరెకర్ కృష్ణవేణికి ఆదిలాబాద్ రిమ్స్‌లో బి+ రక్తం అత్యవసరంగా అవసరమైందని సమాచారం అందగానే ప్రజా శంఖారావం పాత్రికేయుడు పడిగేల నాగరాజు స్పందించి అక్కడికి చేరుకుని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక బాధ్యతను చాటుతూ ఆదర్శంగా నిలిచారని స్థానికులు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ముందుకు సాగుతున్న నాగరాజును పలువురు అభినందించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగ ఇంటర్వ్యూలు

**కామారెడ్డి, ఏప్రిల్ 3 :**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం (ఏప్రిల్ 6) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంఎస్ఎన్ ఫార్మా సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జయకుమారి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు మరియు ఇటీవల పరీక్షలు ముగించిన వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.




## బార్ అసోసియేషన్ కు నారాయణ, సురేందర్ రెడ్డి ఎన్నిక

**కామారెడ్డి, ఏప్రిల్ 3:**

జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బత్తుల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బండారి సురేందర్ రెడ్డి ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షులుగా రాజు, సంయుక్త కార్యదర్శిగా భార్గవ్ చంద్ర భోపాల్, కోశాధికారిగా విఠల్ రావు, లైబ్రరీ సెక్రటరీగా దేవేందర్ గౌడ్, క్రీడల కార్యదర్శిగా యాదగిరి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యుల పదవులకు పోటీ నెలకొన డంతో ఆరుగురు అభ్యర్థులు పోటీలో నిలవగా, జరిగిన ఎన్నిక ల్లో గంగరాజు, సంజిత్, షేక్ ఇర్ఫాన్ హుస్సేన్ విజయం సాధిం చారు. ఈ కార్యవర్గం ఒక సంవత్సరం పాటు కొనసాగుతుందని, బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ మార్గదర్శకాల ప్రకారం ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి వైద్య అమృత రావు తెలిపారు. కొత్త కార్యవర్గం వచ్చే సంవత్సరం ఏప్రిల్ వరకు పదవిలో కొనసాగనుందని తెలిపారు.




## చలివేంద్రం ప్రారంభం

**భీమ్‌గల్, ఏప్రిల్ 3 :**

భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎంఏ. సమీర్, ఉపసర్పంచ్ మంద గోవర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన స్పెషల్ ఆఫీసర్ మండల విద్యాశాఖ అధికారి డి.స్వామి, సర్పంచ్ శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామానికి వచ్చి ప్రజలకు వేసవికాలంలో ఎండలు ఎక్కువ కొట్టడం వలన ప్రజలకు నీటి బాధ లేకుండా నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని ముందస్తు ఆలోచనతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ ఎడ్ల శేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్ని రెడ్డి, నాయకులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# శ్రీ భాషిత పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




**ఆర్మూర్, ఏప్రిల్ 3:**

ఆర్మూర్ లోని శ్రీభాషిత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం రోజు క్షత్రియ ఫంక్షన్ హాల్ లో పిపి3 (యూకేజీ), ఐదవ తరగతి విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి, గౌరవ అతిథులుగా 29 వ వార్డు కౌన్సిలర్ బత్నాసె తిరుమల సుమన్, 23వ వార్డు కౌన్సిలర్ అన్నారపు నాగరాజు బొట్టు రాజు, 3వ వార్డు కౌన్సిలర్ యాదాద్రి కవితా భాస్కర్ హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ఉపన్యాసాలు, సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి మాట్లాడుతూ, శ్రీభాషిత పాఠశాల విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ప్రతిభ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల అందిస్తున్న విద్య ఎంతో ప్రశంసనీయం అని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం గౌరవ అధితులు మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణంలోనే శ్రీభాషిత పాఠశాల ఒక గొప్ప విద్యా సంస్థగా పేరుగాంచింది. విద్య కోసం నిరంతరం కష్టపడే యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. రానున్న రోజులలో శ్రీ భాషిత పాఠశాల నూతన విద్యా ప్రమాణాలతో నిలవాలని అన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్, మాట్లాడుతూ వేడుకలు సంబరాలు అనేవి భారతీయ సంస్కృతి కి వెన్నుముక అని, ప్రతి సందర్భాన్ని ఒక సంబరంగా జరుపుకోవడం ఒక సనాతన ఆనవాయితీగా ఉందని, ఇలాంటి వేడుకలు చిన్నారి విద్యార్థులకు ఎంతో ఉత్సాహం, ఆనందాన్ని కలిగిస్తాయని ఆయన తెలిపారు. అలాగే ఈ ఆనందం విద్యార్థులను విద్య పట్ల ఆసక్తి, శ్రద్ధగా మలచ వచ్చని ఆయన తెలిపారు. గొప్ప పాఠశాల అంటేనే విద్యార్థులు ఆనందంగా రావడం అని, కష్టంగా రావడం కాదని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల, చిన్న వయసులోనే క్రమశిక్షణ, విద్య పట్ల ఆసక్తి, సృజనాత్మకత, నిర్మాణాత్మక, విమర్శనాత్మక, పరిశోధనాత్మక ఉన్నత స్థాయి నైపుణ్యాలను పెంపొందించడానికి ఉపయోగకరమని అన్నారు. పాఠశాలకు సహకరిస్తున్న విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, అన్ని రంగాలలో విద్యార్థులను తీర్చిదిద్దడంలో శ్రీ భాషిత పాఠశాలకు ఎవరు సాటిరారని, ఈ సంవత్సరం నుండి పాఠశాలలో అధునాతన సైన్స్ ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విద్యార్థులు గ్రాడ్యుయేషన్ గౌన్లు ధరించి స్టేజ్ పై ప్రవేశించడం, వారి ఆట, పాటలు, ఉపన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్నాయి. అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు, గౌరవ అతిథులు, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్స్, కోర్ కమిటీ మెంబర్స్, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.







## 14న మెగా రక్తదాన శిబిరం

**కామారెడ్డి, ఏప్రిల్ 3:**

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14న కామారెడ్డి జిల్లా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) సంయుక్త సహకారంతో, జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని కర్షక్ బి.ఎడ్ కళాశాలలో మంగళవారం జరిగే ఈ శిబిరం ద్వారా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సహాయం అందించడమే లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొనే మొదటి 200 మంది రక్తదాతలకు హెల్మెట్లు అందజేయనున్నట్లు ప్రకటించారు. మహనీయుల జయంతులను స్ఫూర్తిదాయకంగా మార్చుతూ, సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా అందరూ ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి డాక్టర్ అంబేద్కర్‌కు నిజమైన నివాళులు అర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్, రక్తదాన కార్యక్రమ కోఆర్డినేటర్ బాలు, జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ నాయక్, ప్రధాన కార్యదర్శి సంగయ్య, కోశాధికారి శ్రీనివాస్, మండల నాయకులు రాజయ్య, వంశీ, ఎంకొల్ల రాజన్న, సాయి మౌర్య, డి.రాజయ్య, మన్నె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కొమురయ్య సేవలు చిరస్మరణీయం

**కామారెడ్డి, ఏప్రిల్ 3:**

జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ దొడ్డి కొము రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య తెలంగాణ తొలి అమర వీరుడని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల హక్కుల కోసం చిన్న వయసులోనే పోరాడి అమరుడైన మహా వీరుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ధైర్యసాహసాలు, సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సంఘాల నాయ కులు, కుర్మ సంఘం ప్రతినిధులు కూడా పాల్గొని దొడ్డి కొమురయ్య సేవలను స్మరించారు. జిల్లా బీసీ సహాయ అభివృద్ధి అధికారి చక్రధర్‌తో పాటు కొత్తపల్లి మల్లయ్య, శివరాములు, గణేష్ నాయక్, విఠల్, నాగరాజు, భూమయ్య, సంజీవ్ స్వామి, అశ్వక్, నరేష్, స్వప్న, సునీత, పవన్, జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



## యేసుక్రీస్తు త్యాగమే విమోచన మార్గం

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఏప్రిల్ 3:**

నిజామాబాద్ రూరల్ సిరికొండ మండలం చిన్న వాల్గోట్ గ్రామంలోని దివైన్ క్రైస్ట్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మానవుల పాప విమోచన కోసం యేసుక్రీస్తు సిలువపై ప్రాణత్యాగం చేశారని విశ్వసిస్తూ ఆయన త్యాగాన్ని స్మరించుకున్నారు.తన జీవితం ద్వారా నీతి, పరిశుద్ధతకు మార్గదర్శకుడైన యేసుక్రీస్తు మానవాళి కోసం త్యాగం చేశారని తెలిపారు. సిలువపై పలికిన ఆయన మాటలు ప్రతి మనిషి జీవితానికి మార్గనిర్దేశం చేస్తాయని భక్తులు పేర్కొన్నారు.




## భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రై డే వేడుకలు

**భీమ్‌గల్, ఏప్రిల్ 3:**

ప్రజలందరిలో వసుదైక కుటుంబం అనే భావన వెల్లివిరియాలని ప్రపంచమంతటా శాంతి నెలకొనాలని పాస్టర్ లు అన్నారు. భీమ్‌గల్ మండలం చేంగల్ కర్మేల్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ లు మాట్లాడుతూ,దైవ కుమారుడైనప్పటికీ క్రీస్తు ప్రభువు ఎన్నో కష్టాలతో బాధింపబడి జనుల రక్షణ కోసం ప్రాణాలర్పించి , క్షమాపణ పంచి త్యాగము చేసిన వ్యక్తి ఏసుప్రభు అని అన్నారు. బడుగు బలహీన కుటుంబాలకు వెలుగులు నింపి అందరికీ పరలోక దీవెనలు పంచిన దైవ కుమారుడు లోక రక్షకుడు అని తెలియజేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు వర్తింప చేయాలని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పెద్ద మనసుతో తమ తీర్పును పునః సమీక్షించుకోవాలని కోరారు. ఏసుప్రభు 33 ఏళ్లకే సర్వమానవాళి కోసం లోకం విడిచిన రోజంటూ పాస్టర్‌లు, డేవిడ్ రాజ్‌లు సందేశాలను వినిపించారు. ఏసుప్రభువును శిలువకు వేయబడిన రోజని తెలియజేశారు. క్రీస్తు చూపిన మార్గం శాంతి కి, ప్రేమకు త్యాగానికి ప్రతిరూపం మండలంలోని వివిధ గ్రామాల నుంచి క్రైస్తవులు హాజరై భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ, దినమంతా చర్చిలోనే గడిపారు. ఉపవాస దీక్షలు పాటించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ విజయ్, సంఘ పెద్దలు దానియేలు, డార్విన్, క్రైస్తవులు పాల్గొన్నారు.




**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఏప్రిల్ 3 :**

సమస్త మానవాళి రక్షణ కోసం ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకానికి అవతరించిన పవిత్ర దినంగా క్రిస్మస్‌ను ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం చిన్న వాల్గోట్ దివిలింగ్ క్రైస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.క్రిస్మస్ పర్వదినం సందర్భంగా శుక్రవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, యేసు జన్మను స్మరించుకుంటారు. “ప్రేమించండి – క్షమించండి” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరి హృదయాలలో నాటే పండుగగా క్రిస్మస్ నిలుస్తుందనీ,పేదలను ఆదుకోవడం, అవసరమైన వారికి సహాయం చేయడం, సోదర భావంతో జీవించడం వంటి విలువలను ఈ పర్వదినం మనకు గుర్తు చేస్తుందనీ పాస్టర్ పేర్కొన్నారు.యేసుక్రీస్తు బోధనలు మానవాళిని సన్మార్గంలో నడిపిస్తూ శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వం వైపు తీసుకెళ్తాయి. ఆయన జననం ప్రపంచానికి వెలుగును నింపిన దివ్య ఘట్టంగా భావించబడుతుందనీ,క్రిస్మస్ పండుగ మనలో ప్రేమ, సేవా భావం, క్షమా గుణాలను పెంపొందిస్తూ సమాజంలో ఐక్యతను బలపరచే మహత్తర పర్వదినంగా నిలుస్తుందనీ క్రైస్తవ సోదరులు ,సోదరీమణులు భావిస్తున్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**లింగంపేట, ఏప్రిల్ 3 :**

లింగంపేట మండలం పరమళ్ళ గ్రామంలో శుక్రవారం సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బాబాయి నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బండ సాయిబాబు ఇంటి వద్ద నుండి గ్రామ పంచాయతీ భవనం వరకు సిసి రోడ్ నిర్మాణం చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామానికి సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ విభాగం సిజిఆర్ఎఫ్ ఫోర్త్ మెంబర్ మర్రిపల్లి రాజా గౌడ్, ఉప సర్పంచ్ శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్వేత గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గంట లక్ష్మణ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**చేగుంట/నార్సింగి, ఏప్రిల్ 3 :**


మెదక్ జిల్లా, దుబ్బాక నియోజకవర్గం నార్సింగి మండల కేంద్రంలో గురువారం పండుగ వాతావరణం నెలకొంది. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన పేదలందరికీ సొంతింటి కల నెరవేరుతుందని చెబుతూ, అంబటి వెంకటలక్ష్మి శ్రీనివాస్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవానికి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిని ప్రారంభించిన ఆయన, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నార్సింగి మండలానికి చెందిన దాయం రామవ్వకు 40,000 రూపాయలు, బుద్ధి కొండయ్యకు 60,000 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎం ఆర్ ఎఫ్ ) చెక్కులను శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మాసాయిపేట శివారులో గుర్తు తెలియని మహిళ మృతి

**చేగుంట/మాసాయి పేట ఏప్రిల్ 3 :**

మెదక్ జిల్లా, చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గల మాసాయి పేట మండలం, మాసాయిపేట గ్రామ శివారులో గల బంగారమ్మ ఆలయం సమీపంలోని బహిరంగ ప్రదేశంలో ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 30 నుండి 35 ఏళ్ల వయస్సు గల సదరు మహిళ, భిక్షాటన చేస్తూ జీవనం సాగించే వ్యక్తిగా స్థానికులు భావిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని బాత్రూమ్ పక్కన ఉన్న చెట్టు కింద ఆమె అనారోగ్యంతో మరణించి ఉండవచ్చని ప్రాథమిక సమాచారం. ఈ ఘటనపై మాసాయిపేట గ్రామ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో, ఆమె వివరాలు తెలిసిన వారు లేదా బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే చేగుంట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని లేదా పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరుతున్నారు.



## మస్కూరి ఉద్యోగం కోసం విద్యుత్ టవర్ ఎక్కిన యువకుడు

**చేగుంట ఏప్రిల్ 3 :**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, పోలంపల్లి గ్రామంలో శుక్రవారం ఒక వ్యక్తి హైటెన్షన్ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ టవర్ ఎక్కి ఆందోళనకు దిగడంతో తీవ్ర కలకలం రేగింది. గ్రామానికి చెందిన ప్రదీప్ అనే వ్యక్తి, ఐదేళ్ల క్రితం పుట్టింటికి వెళ్ళిన తన భార్య తిరిగి రాకపోవడం, తనకు మస్కూరి ఉద్యోగం కల్పించాలనే డిమాండ్‌తో ఈ సాహసానికి ఒడిగట్టాడు. సుమారు వంద అడుగుల ఎత్తున్న టవర్ ఎక్కి మొండికేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, గ్రామస్తులు కలిసి ప్రదీప్‌కు నచ్చజెప్పి సురక్షితంగా కిందకు దించేందుకు గంటల తరబడి శ్రమించారు. ఎలాంటి విద్యుత్ ప్రమాదం జరగకుండా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో పోలంపల్లి గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఇందల్వాయి , ఏప్రిల్ 3 :**

మండల కేంద్రంలోని నల్లవెల్లి గ్రామంలో నిరుపేదలకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని నిరూపిస్తూ, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి గారి ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు మొత్తం రూపాయలు 1,92,500 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దామ సుమన్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి గారు నిరంతరం కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నారని వారు తెలిపారు. తమకు ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ రాజు, పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్, శ్రీనివాస్, ధరంపురి,రవి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ నర్సయ్యకు జర్నలిస్టుల సన్మానం

**ఆర్మూర్ ఏప్రిల్ 3:**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పస్క నరసయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైన సందర్భంగా నవనాథ పురం, ఆర్మూర్ ప్రెస్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాతో ఆయనకు నవనాథ పురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పార్దెం సంజీవ్ ఘనంగా సన్మానం చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ ఎంపీపీగా ఉన్న సమయంలో పస్క నరసయ్య, జర్నలిస్టులకు భవనం ఉండాలనే ఉద్దేశంతో ప్రెస్ క్లబ్ భవనాన్ని కేటాయించారు. ప్రెస్ క్లబ్ భవనం కేటాయించి సహకరించిన ఆయన నేడు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైనందున జర్నలిస్టులు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ పస్క నరసయ్య, జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ భవనాన్ని కేటాయించడానికి కృషి చేశారని, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం కావడం చాలా సంతోషకర విషయం అన్నారు. రాబోయే రోజులలో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పస్కా నరసయ్యకు, జర్నలిస్టులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సాత్ పుతే శ్రీనివాస్, సంతోష్, కోడె మనోహర్, నరేందర్, విన్సెంట్, ముత్యం, బారడ్ గణేష్, చిరంజీవి, గోజురు మహిపాల్, చరణ్ గౌడ్, లిక్కి శ్రావణ్, వెంకటేశ్వర్ గుప్తా, వినోద్, సాజిద్, యాయా, సాయి, నితేష్, గంగా మోహన్, గోలి పురుషోత్తం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.





## రామారెడ్డి జాతరలో పోలీసుల అవగాహన




**కామారెడ్డి, ఏప్రిల్ 3 :**

రామారెడ్డి జాతర ఆవరణలో పోలీసులు ప్రజల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరల్లో దొంగతనాలు జరిగే అవకాశముండటంతో, విలువైన బంగారు ఆభరణాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, రామారెడ్డి సబ్-ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోలీస్ కళాబృందం పాటలు, మాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని, రోడ్డు ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు, సైబర్ ఫిర్యాదులకు 1930కు కాల్ చేయాలని సూచించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ నంబర్ 8712686094ను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, పోలీస్ సిబ్బంది ప్రభాకర్, సాయిలు, రాజనర్సయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. జాతరకు వచ్చిన భక్తులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణ రావు



**జూలపల్లి, ఏప్రిల్ 3 :**

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి జాతర మహోత్సవంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో విజయరమణ రావుకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొమ్మ పోచాలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ గొట్టేముక్కాల రజిని రవీందర్ రెడ్డి, సర్పంచ్ తోగారు శ్రీనివాస్, దండే వెంకటేష్, పెంట కిషోర్, కందుకూరు అంజయ్య, జక్కని శెంకరయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన నల్లవెల్లి గ్రామ ప్రతినిధులు

**ఇందల్వాయి, ఏప్రిల్ 3, :**



మండల కేంద్రంలోని నల్లవెల్లి గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు మరియు సర్పంచ్ కన్నె రాజేందర్ శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గ్రామ ఉమ్మడి ప్రయోజనాల కోసం కొత్తగా ఎన్నికైన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా సమావేశమై గ్రామంలోని సమస్యలను వివరించారు. ముఖ్యంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, నల్లవెల్లి గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామ సర్పంచ్ కన్నె రాజేందర్, ఏఎంసి డైరెక్టర్ రాజు, పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్, సంబెటి రవీందర్, గంగారెడ్డి,నూతన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న టీపీసీసీ

**కామారెడ్డి, ఏప్రిల్ 3 (ప్రజా శంఖారావం) :**

కామారెడ్డి నియోజకవర్గంలోని బస్వాపూర్ గ్రామంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన చర్చి ప్రార్థన కార్యక్రమంలో టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్త మానవాళి పాప పరిహారం కోసం యేసు క్రీస్తు చేసిన మహా త్యాగానికి గుడ్ ఫ్రైడే ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. తోటి మనిషిపై ప్రేమ, అపార సహనం, అవధులు లేని త్యాగమే యేసు జీవితం మానవాళికి అందించిన గొప్ప సందేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు తాటి ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ జూలూరి సుధాకర్, పంపరి శ్రీనివాస్, సాయిబాబా, గంగుల్ రెడ్డి, నర్సిల్ల మహేష్, బండారి శ్రీకాంత్, బల్ల శ్రీనివాస్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# 5న మాదిగ మహాశక్తి జెండా ఆవిష్కరణ సభ

**ఆర్మూర్ ఏప్రిల్ 3:**




బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 5న హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఉదయం 11 గంటలకు మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, మాదిగ మహాశక్తి కోసం తీర్చిదిద్దిన మాదిగల ఆత్మ గౌరవ నూతన జెండా ఆవిష్కరణ సభకు మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎంపీపీ పస్క నరసయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదిగల మహా శక్తిని మోత్కుపల్లి నర్సింలు, ఏర్పాటు చేసినందున మాదిగలు, మాదిగ ఉప కులాలు పెద్ద సంఖ్యలో రావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల మంది మాదిగలు ఉన్న రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ఉప కులాలు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన మాదిగ ఆత్మీయ సభలలో మాదిగలు పెద్ద సంఖ్యలో తరలి రావడాన్నీ గమనించి మోత్కుపల్లి నర్సింలు అధ్యక్షతన మేధావుల చేత నిర్ణయించబడ్డ నూతన జెండాను నిర్మాణం చేసినట్లు వివరించారు. ఈ ఆవిష్కరణకు మాదిగలు, మాదిగ ఉప కులాల వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాగరాజు, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో ప్రేమజంట ఆత్మహత్య

**చేర్యాల(సిద్దిపేట), (ప్రజా శంఖారావం):**

పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో ప్రేమజంట ఆత్మహత్యలకు పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో చోటుచేసుకుంది. ముస్త్యాల గ్రామానికి చెందిన తరిగొప్పుల హారిక (24), అదే గ్రామానికి చెందిన అనుముల రాకేశ్ (27) ప్రేమించుకుని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే కుటుంబ సభ్యులు వారి వివాహానికి అంగీకరించకపోవడంతో గత నెల 28న రాకేశ్ పురుగుల మందు సేవించాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సమాచారం. ప్రియుడు మృతి చెందిన తర్వాత మనోవేదనకు గురైన హారికను కుటుంబ సభ్యులు జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రంలోని బంధువుల ఇంటికి తరలించారు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ప్రేమజంట ఆత్మహత్యలు చేసుకోవడంతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది.

# నిలిచిన మీ సేవ సేవలు



**ఆర్మూర్ ఏప్రిల్ 3:**

తెలంగాణ రాష్ట్రంలో నిలిచిన మీసేవ సేవలు. మీసేవ సర్వర్ మైంటెనెన్సు కారణం గా ఏప్రిల్ 3వ తేదీ సాయంత్రం 8:00నుండి 5 వ తేదీ ఉదయం 8:00 గంటల వరకు మీసేవ సర్వీసులు అందుబాటులో ఉండవు కావున ప్రజలు సహకరించాలని, మైంటెనె న్సు పూర్తి అయిన తరువాత యాదవిధిగా మీసేవ సేవలను అందిస్తామని మీసేవ మండల అధ్యక్షులు మీర శ్రావణ్ కుమార్, కార్యదర్శి మీసాల సురేష్ లు తెలిపారు.

# క్రీడల్లో జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయాలి

- క్రీడాకారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు
- సీఎం కప్ విజేతలకు అభినందన సభ
- అంతర్జాతీయ క్రీడాకారులు గూగులోత్ సౌమ్య, హుస్సాముద్దీన్ లకు ఘనంగా సత్కారం



**నిజామాబాద్, జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 3 :**

సరిపడా సౌకర్యాలు లేనప్పటికీ క్రీడా రంగంలో నిజామాబాద్ జిల్లా అద్వితీయ ప్రతిభను కలిగి ఉండడం ఎంతో గర్వించదగ్గ విషయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ జిల్లాకు చెందిన హుస్సాముద్దీన్, గుగులోత్ సౌమ్య, యెండల సౌందర్య, నిఖత్ జరీన్ వంటి ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ నిజామాబాద్ కు ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారని కొనియాడారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు ముందుకుసాగాలని, నిజామాబాద్ జిల్లా ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ – 2025 క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు శుక్రవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. వివిధ అంశాలలో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ అభినందిస్తూ, వారికి మెడల్స్, బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. నిజామాబాద్ జిల్లా వాసులైన అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత హుస్సాముద్దీన్, భారత ఫుట్ బాల్ జట్టు కెప్టెన్ గుగులోత్ సౌమ్యలు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వీరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అద్భుతమైన ప్రతిభా పాటవాలు కలిగిన అనేక మంది క్రీడాకారులు ఈ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తుండడం గొప్ప విషయమని అన్నారు. తాను కూడా కళాశాలలో చదివే రోజుల్లో స్విమ్మింగ్ లో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జిల్లాలో క్రీడా సదుపాయాల మెరుగుదలకు, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియంల ఏర్పాటు కోసం జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక కృషి చేస్తామని, వీటి ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రభుత్వానికి నివేదిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. సీ.ఎం కప్ క్రీడా పోటీల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు 31,353 మంది క్రీడాకారులు వివిధ దశలలో పాల్గొనడం ద్వారా జిల్లాను మొదటి స్థానంలో నిలిపారని అన్నారు. 2700 మంది జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో వివిధ అంశాలలో పాల్గొని 53 పతకాలు సాధించడం జరిగిందన్నారు. వీటిలో 12 బంగారు పతకాలు, 11 వెండి పతకాలు, 33 కాంస్య పతకాలు ఉన్నాయని, తద్వారా నిజామాబాద్ జిల్లా రాష్ట్ర స్థాయిలో టాప్–5 లో నిలిచిందని అభినందించారు. కోచ్ లు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మరింతగా రాణిస్తూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపాలని కలెక్టర్ ఉద్బోధించారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపితే, అద్భుత అవకాశాలు దక్కుతాయని, ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సూచించారు. ఉద్యోగ నియామకాలతో పాటు, ఉన్నత విద్యావకాశాలలోనూ స్పోర్ట్స్ కోటా కింద ప్రవేశాలు పొందవచ్చని అన్నారు. విద్యార్థులను, యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు తమ నైపుణ్యాలను మరింతగా మెరుగుపర్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సీ.ఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభను చాటేలా విద్యార్థులను తీర్చిదిద్దిన కోచ్ లను, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బందిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిని ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డివైఎస్ఓ పవన్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగమణి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ బొబ్బిలి నర్సయ్య, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా 'విశ్వకళ్యాణం మ్యాట్రిమోనీ' సేవల ప్రారంభం

**సుల్తానాబాద్, ఏప్రిల్ 3:**

విశ్వబ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'విశ్వకళ్యాణం మ్యాట్రిమోనీ' సేవలను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలోని మహమ్మాయి దేవాలయంలో జరుగుతున్న అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ ఆధునిక డిజిటల్ యుగంలో సంప్రదాయాలను కాపాడుతూ సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ మ్యాట్రిమోనీ వేదికను రూపొందించారని తెలిపారు. విశ్వబ్రాహ్మణ యువతకు సరైన జీవిత భాగస్వాములను సులభంగా కనుగొనేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో ప్రారంభమైన ఈ వేదిక ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న విశ్వబ్రాహ్మణుల మధ్య అనుసంధానం బలోపేతం అవుతుందని, సమాజ ఐక్యతకు దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. సాంకేతికతను వినియోగించి సామాజిక సేవలను విస్తరించే దిశగా ఇది మంచి ముందడుగని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, సుల్తానాబాద్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్లు బిరుదు రాధాకృష్ణ, నూగిల్ల మల్లయ్య, చిన్నకల్వల, చిన్నబోంకురు సర్పంచులు ఏరుకొండ స్రవంతి రమేశ్, అబ్బోజు కవిత బ్రహ్మచారి, మ్యాట్రిమోనీ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# లక్ష్యాన్ని చేరుకోలేకపోయిన పీఎం విశ్వకర్మ యోజన పథకం



**ఆర్మూర్, ఏప్రిల్ 3:**

చేతివృత్తుల వారిని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పీఎం విశ్వకర్మ యోజన పథకం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదని అఖిల భారతీయ విశ్వకర్మ తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్ చారి తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని, నిరుపేద విశ్వకర్మలు ఈ పథకంపై పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నప్పటికీ నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. పథకం కింద అందించాల్సిన టూల్ కిట్లు అనేక మందికి అందలేదని, టూల్ కిట్ పొందిన వారు బ్యాంకు రుణాల కోసం వెళ్లినా అధికారులు సరైన స్పందన ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు రుణాలను తిరస్కరించిన సందర్భాలు కూడా ఎక్కువగా ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పథకం అమలు సరిగా జరగడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సంబంధిత అధికారులకు, బ్యాంకు సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని, అర్హులైన వారికి టూల్ కిట్లు, రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ విశ్వకర్మ మండల అధ్యక్షుడు నూనె గంగాధర్ చారి, సుంకం విష్ణు చారి, ముట్టుకు నారాయణ చారి, శ్రీరాం ప్రశాంత్, ముట్టుకు నాగేంద్ర చారి, చరణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏ ఉద్యోగం కోసం టవర్ ఎక్కిన యువకుడు

- ఎమ్మెల్యే కేపీఆర్ హామీతో సద్దుమణిగిన ఉద్రిక్తత



**చేగుంట ఏప్రిల్ 3 :**

మెదక్ జిల్లా,చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో వీఆర్ఏ ఉద్యోగం కోసం ఓ నిరుద్యోగి చేసిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన ప్రదీప్ కుమార్ అనే యువకుడు విద్యుత్ హైటెన్షన్ మెయిన్ లైన్ టవర్ ఎక్కి నిరసన చేపట్టాడు. గతంలో ఉన్న వీఆర్ఏ వ్యవస్థ రద్దు కావడంతో తన కుటుంబంలో ఉద్యోగం పోయిందని, తక్షణమే వీఆర్ఏ వ్యవస్థను పునరుద్ధరించి తనకు ఉద్యోగం కల్పించాలని, సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడికి రావాలని మొండికేశాడు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి (కేపీఆర్) స్వల్ప అనారోగ్యంతో ఉన్నప్పటికీ హైదరాబాద్ నుండి హుటాహుటిన పోలంపల్లికి చేరుకున్నారు. టవర్ పై ఉన్న యువకుడితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణ కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ప్రదీప్ కుమార్ సుమారు గంటల తరబడి సాగిన ఆందోళనను విరమించి కిందకు దిగాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగులు మనోధైర్యం కోల్పోవద్దని, ఉద్యోగాల కోసం పోరాటం చేయాలి తప్ప ఇలా ప్రాణాలకు ముప్పు తెచ్చుకునే పనులు చేయవద్దని సూచించారు. యువకుడు సురక్షితంగా కిందకు దిగడంతో అటు అధికారులు, ఇటు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# పెర్కిట్ చెరువులో చేపల మృత్యువాత!.

- చేపల మృతికి కలుషిత నీరు కారణమా?
- మత్స్య శాఖ అధికారుల చర్యలేవి?



**ఆర్మూర్ ఏప్రిల్ 3:**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ ఊర చెరువులో నీరు కలుషితం కావడంతో భారీ సంఖ్యలో చేపలు మృత్యువాత పడుతున్న ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఏడాది వేసవి కాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతుండటంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువులో నీటి నాణ్యత తగ్గిపోవడం, కాలుష్యం అధికమవడం వల్ల చేపలు బ్రతకలేని పరిస్థితి ఏర్పడుతోందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మత్స్య శాఖ అధికారులు ప్రతి సంవత్సరం నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనోపాధి పూర్తిగా చెరువుపైనే ఆధారపడి ఉందని, ఇలా చేపలు చనిపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర నష్టం కలుగుతోందని వాపోతున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని చెరువులో కాలుష్యాన్ని నివారించి, శాశ్వత పరిష్కారం చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ సమస్యపై స్పందిస్తూ, చెరువులోకి కాలుష్యపు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతున్నారు.

# గిరిజన సంక్షేమం కోసం ఐటిడిఏ కృషి

**ఉట్నూర్, ఏప్రిల్ 3:**



సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తోందని ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ తెలిపారు. శుక్రవారం ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ కలెక్టర్ల బృందంతో నిర్వహించిన సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, గిరిజనులకు అందుతున్న విద్య, వైద్యం, పి.వి.టి.జి.లకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అధికార యంత్రాంగం సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులైన గిరిజనులకు ఫలాలు అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు కూడా ఐటిడిఏ పరిధిలోని ప్రతి అర్హ గిరిజనుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెండు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా విచ్చేసిన 20 మంది డిప్యూటీ కలెక్టర్ల బృందం ఐటిడిఏ ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా నర్సరీలో చేపడుతున్న పలు కార్యక్రమాలను అధికారులకు వివరించారు. పండ్ల తోటల పెంపకం, సాగు పద్ధతులు, అంట్లు కట్టడం, కొమ్మల కత్తిరింపు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, కూరగాయల నారు పెంపకం, వేసవి పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు. బృందంలోని పలువురు అధికారులు వ్యవసాయ నేపథ్యానికి చెందినవారని తెలిపారు. వివిధ పంటలపై ఆసక్తికర ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలు, ప్రజల కు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీ లించారు.

# ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి

**ఖమ్మం, ఏప్రిల్ 3 :**

తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, అమరవీరుడు దొడ్డి కొమరయ్య జయంతిని ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమర్ మీడియాతో మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రాణం అర్పించిన మహానుభావుడని తెలిపారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి రైతుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన యోధుడని కొనియాడారు. రైతులు, కార్మికులు, పేదల కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శిస్తూ, రైతులు, నిరుద్యోగులు, పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద జేఏసీ నాయకులు బిచ్చల తిరుమల, నగర బీసీ సెల్ అధ్యక్షుడు మేకల సుగుణరావు, మాటూరు లక్ష్మీనారాయణ, నగర ప్రచార కార్యదర్శి షకీన, బోజెడ్ల రాంమోహన్, బీఆర్టీయూ నాయకులు ఎండీవై పాషా, చిన్న మల్లేశం, కురుమ ఆరంపుల వీరభద్రం, సత్తార్ మియా, ఉస్మాన్, నెమలి కిషోర్, కుదురుపాక నర్సయ్య, రఫీ, ఆసిఫ్, మోటే కుమార్, ఫణికృష్ణ, పిడతల రామ్మూర్తి, తోడేటి లింగరాజు, మాధవి, పోలే పొంగు వెంకట్, పిట్టల తిరుమల్, సాజిద్, కొంపల్లి నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# టెంపుల్ చైర్మన్ లక్ష్మణ్ కు కవ్వంపల్లి పరామర్శ



తిమ్మాపూర్, ఏప్రిల్ 03: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తిమ్మాపూర్ మండలం నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మెన్ బండారిపల్లి లక్ష్మణ్ ను మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. శుక్రవారం కరీంనగర్ లోని లక్ష్మణ్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులు, ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. లక్ష్మణ్ ను పరామర్శించిన వారిలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కంది అశోక్ రెడ్డి, ఊట్కూరి వెంకటరమణారెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

**నుస్తులాపూర్ లో...**

తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ దాబా ను మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో దాబా నిర్వాహకుడు నందికొండ శేఖర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారు రమేష్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బుదారపు శ్రీనివాస్, ఎస్ కొండలరావు, గోగూరి నరసింహారెడ్డి, పొన్నాల చిరంజీవి, ద్యావ శ్రీనివాసరెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, సంగు వేణు, నందికొండ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మొగిలిపాలెంలో...**

తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త దుద్దెల రాజమల్లు-విజయదంపతుల కుమార్తెమనీషా వివాహానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి,పార్టీ తుమ్మనపల్లి శ్రీనివాసరావు, లింగయ్య, శ్రీనివాస్, రాజిరెడ్డి, మల్లయ్య, రమేష్, రవి, కిరణ్ కుమార్, సతీష్ రెడ్డి, జనార్దన్ రావు తదితరులు ఉన్నారు.

**వల్లంపట్లలో...**

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎలగందుల బాలయ్య మనవడు కార్తీక్ వివాహానికి హాజరై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ వివాహ వేడుకకు హాజరైన వారిలో మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, వల్లంపట్ల సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్, ఉప సర్పంచ్ కె. రాజు, పార్టీ నాయకులు మేకల శ్రీనివాస్, గజ్జల రాజశేఖర్, ఎలుక అనిల్ కుమార్, బంగారు ఆంజనేయులు, నాగరాజు ఉన్నారు.

## కృష్ణవేణి హై స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే, స్పోర్ట్స్ & కల్చరల్ మీట్

### విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసానికి నాంది..



**మంథని, ఏప్రిల్ 03:**మంథని పట్టణంలోని కృష్ణవేణి హై స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను పాఠశాల ప్రిన్సిపల్ అరిసె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ ప్రాథమిక విద్యను పూర్తి చేసి ఉన్నత విద్య దిశగా అడుగులు వేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి పునాది అని, ప్రాథమిక దశలోనే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, లక్ష్యసాధన వంటి విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ డే వంటి వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు భవిష్యత్ లక్ష్యాల వైపు దృష్టి సారించేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జాఫర్ హుస్సేన్, సుదర్శన్ రెడ్డి, నరేష్ లు , ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన అడ్వకేట్ బార్ అసోసియేషన్ సభ్యులని సన్మానించిన టీఎస్ టీఎస్ మాజీ చైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్



**పెద్దపల్లి, ఏప్రిల్ 03:**పెద్దపల్లి అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులుగా పెద్దలు సీనియర్ న్యాయవాది మేకల మల్లేశంని, ప్రధాన కార్యదర్శి రచూరి శ్రీకాంత్ ని, ఉపాధ్యక్షులుగా లకిడి శ్రావణ్ ని ,కోశాధికారిగా బొంకూరి సంతోష్( బాబ్జి)ని,లైబ్రరీ సెక్రెటరీగా పుట్ట రవిని ,స్పోర్ట్స్ మరియు కల్చరల్ సెక్రటరీగా తాని నరేష్ లని శాలువా కప్పి సన్మానించి స్వీట్ తినిపించిన టిఎస్ టిఎస్ మాజీ చైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్ కుమార్. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది AGP ఉప్పు రాజన్న, అడ్వకేట్ రమేష్, హనుమంతుని పేట్ సర్పంచ్ మాడగొని శ్రీనివాస్ మరియు ఉప సర్పంచ్ మేకల కుమార్ యాదవ్, ఉప్పు శివ కుమార్ తదితరులు ఉన్నారు.

## స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ముత్తారం మండల కేంద్రంలో ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు...



**ముత్తారం, ఏప్రిల్ 03:** స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు గారి వర్ధంతి సందర్భంగా పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నేత్ర శస్త్ర చికిత్స శిబిరాన్ని ముత్తారంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, DCP రాంరెడ్డీ, ACP మడత రమేష్,TPCC రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు. ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాద రావు గారి 27వ వర్ధంతిని పురస్కరించుకుని పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాన్ని స్వర్గీయ శ్రీపాదరావు గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.మరింతగా అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేయబడతాయని వైద్య బృందం తెలియజేయడం జరిగింది. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష , DCP రామ్ రెడ్డి, ACP మడత రమేష్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ధన్వాడలో పుట్టి శాసనసభ స్పీకర్ స్థాయికి ఎదిగిన మహనీయులు దుద్దిళ్ళ శ్రీపాదరావు అని పేర్కొన్నారు. న్యాయవాదిగా వృత్తి కొనసాగిస్తున్న సమయంలో ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయాల్లోకి వచ్చి, సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ స్థాయికి ప్రజల ఆశీర్వాదంతో ఎదిగారని తెలిపారు. నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న వ్యక్తి శ్రీపాదరావు అని కొనియాడారు. అలాగే మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి జీవితంలోని ముఖ్యాంశాల నుంచి వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన పాఠాలను నేర్చుకోవచ్చని అన్నారు. శ్రీపాదరావు చూపిన మార్గంలోనే వారి కుటుంబ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం ఎంతో గొప్ప కార్యక్రమమని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు ఆధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేశారని, ఈ సేవల వల్ల అనేక మంది పేద ప్రజలు లబ్ధి పొందినట్లు వారు పేర్కొన్నారు ఈ సందర్భంగా TPCC రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు మాట్లాడుతూ, శ్రీపాద రావు గారి సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా నిర్వహించేందుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఈ నెల 13 వ తేదీన కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందని దుద్దిల్ల శ్రీను బాబు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా చైర్మన్ లు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు, యూత్ కాంగ్రెస్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు జిల్లా నాయకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## 7న హౌసింగ్ బోర్డులో తలపెట్టిన హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి

### శ్రీయజ్ఞవరాహ స్వామి హిందూ సమ్మేళన సమితి పిలుపు.....

**కరీంనగర్, ఏప్రిల్ 03:** కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఈనెల 7న తలపెట్టిన హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీయజ్ఞవరాహ స్వామి హిందూ సమ్మేళన సమితి పిలుపు నిచ్చింది. శుక్రవారం రోజున శ్రీ యజ్ఞ వరహస్వామి హిందూ సమ్మేళన సమితి బాధ్యులు ఆహ్వాన పత్రికను రిలీజ్ చేసి ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సమ్మేళన సమితి బాధ్యులు మాట్లాడుతూ హిందువులలో ఐక్యత, సంఘటితశక్తి నీ చాటి చెప్పడానికి హిందూ సమ్మేళనం వేదిక కాబోతుందన్నారు. ప్రతి హిందువు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ యజ్ఞవరాహ స్వామి హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు , సి ఎ .చోలేటి రమేష్ కార్యదర్శి గంద్ర సత్యనారాయణ, కోశాధికారి , విభాగ సహాయ వ్యవస్థ ప్రముక్ దావులూరి మురళీధర్ , బస్తీ ప్రముక్ రాంరెడ్డి, మండల వ్యవస్థ ప్రముఖ్ తాడేం ఐలయ్య , కార్యవాహ లక్ష్మీనారాయణ , ప్రముఖ సి ఎ శ్వరలక్ష్మి ,జలజ మాతాజీ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది _ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




**గోదావరిఖని, ఏప్రిల్ 03:** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 47, 48, 49 డివిజన్లు మరియు 8వ డివిజన్‌లో నిర్వహించిన గ్రామ సభ "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను శ్రద్ధగా విన్నారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో మరింత పురోగతి సాధించాలని సూచించారు. ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరగా పాలన చేరడం, వారి అభిప్రాయాలను ప్రణాళికల్లో ప్రతిబింబించడం ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే గారు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, కార్పొరేటర్లు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగి, ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య తో పాటు కార్పొరేటర్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మంథని లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి



**మంథని ఏప్రిల్ 03 :**మంథని లో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు, బ్రిడ్జి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఏగోళం శంకర్ గౌడ్ మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, పరాక్రమ వంతుడైన ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 3న జరుపుకుంటారనీ ఆయన 17వ శతాబ్దపు గొప్ప హిందూ యోధుడు, శివాజీ జయంతి (ఫిబ్రవరి 19) మరియు వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా, ముఖ్యంగా మహారాష్ట్రలో ఆయన వారసత్వాన్ని, ప్రజల పట్ల ఆయన నిబద్ధతను స్మరించుకుంటూ నివాళులర్పిస్తారనీ హిందూ ధర్మ పరిరక్షణ, స్వరాజ్య స్థాపన, మరియు అద్భుతమైన పరిపాలనా దక్షతకు శివాజీ ప్రతీక.నివాళిఅని అన్నారు: ఈ రోజున ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు ప్రసంగాల ద్వారా ఆయన ధైర్యసాహసాలను, గెరిల్లా యుద్ధ తంత్రాలను (గనిమి కవా) ప్రజలు స్మరించుకుంటారనీ 17వ శతాబ్దంలో మొఘల్ రాజవంశాన్ని ఎదిరించి, మరాఠా రాజ్యాన్ని స్థాపించిన యోధుడు గా చరిత్రలో నిలిచిపోయారనీ శివాజీ మహారాజ్ ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన ధైర్య మార్గంలో నడవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాసులపల్లిలో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు..



**పెద్దపల్లి, ఏప్రిల్ 03:** పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలో శుక్రవారం కుర్మ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గద్దల రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కుర్మా సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంబోజు మృతి పత్రికా రంగానికి తీరని లోటు..

### నివాళులు అర్పించిన టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ



**కరీంనగర్, ఏప్రిల్ 03:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్టు చొప్పదండి వార్త విలేకరి సంబోజు శేఖర్ శుక్రవారం ఉదయం గుండెపోటు తో మరణించారు, ఆయన మరణం జర్నలిస్టు సమాజానికి జర్నలిస్టు సంఘానికి తీరని లోటని టీయూడబ్ల్యూజే ఐజేయూ కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్రశేఖర్ అన్నారు. యూనియన్ పక్షాన తక్షణ సహాయంగా 10 వేల రూపాయలు అందజేసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి ఊరడి రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు జన్నారం శ్రీనివాస్, కంకణాల రఘు పాల్గొన్నారు.



# నేను క్రికెట్ ఆడటం వారికి నచ్చడం లేదు

## రహానే సంచలన వ్యాఖ్యలు!

**ఢిల్లీ:** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మరో ఓటమి ఎదురైంది. టోర్నీ మొదటి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో ఓడిన కేకేఆర్.. రెండో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) చేతిలో ఓటమిని చవిచూసింది. ఎస్ఆర్‌హెచ్ నిర్దేశించిన 227 పరుగుల భారీ లక్ష్యంను ఛేదించే క్రమంలో కేకేఆర్ తడబడింది. నిర్ణీత ఓవర్లలో 161 పరుగులకే ఆలౌట్ అయి వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది. ఈ ఓటమితో కేకేఆర్ అభిమానులు నిరాశకు గురయ్యారు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన కెప్టెన్ అజింక్య రహానే.. 10 బంతుల్లో 8 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరారు. కీలకమైన సమయంలో నెమ్మదిగా ఆడి తక్కువ పరుగులకే అవుట్ కావడంతో.. రహానే స్ట్రైక్‌రేట్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఆధునిక టీ20 ఫార్మాట్‌కు తగ్గట్లుగా రహానే ఆడలేకపోతున్నారనే వాదనలు వినిపించాయి. వాటిపై రహానే ఘాటుగా స్పందించాడు. తన సక్సెస్ చూడలేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారంటూ మండిపడ్డాడు. తాను క్రికెట్ ఆడటం కొందరికి నచ్చడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో జింక్స్ స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. 'నా స్ట్రైక్‌రేట్‌పై విమర్శలు చేసేవారికి అసలు క్రికెట్ గురించి తెలుసో లేదో అర్థం కావడం లేదు. బహుశా వారు సరిగ్గా మ్యాచ్‌లు చూడటం లేదేమో. లేదా నాపై ఏదైనా ప్రత్యేక అజెండాతో ఉన్నారేమో అనిపిస్తోంది. నా సక్సెస్ చూసి కొందరు అసూయ పడుతున్నారు. అందుకే నా ఆటను తక్కువ చేసి మాట్లాడుతున్నారు. కేవలం ఒక్క ఇన్నింగ్స్ ఫెయిల్యూర్‌ను బట్టి నా ఉద్దేశాలను తప్పుబట్టడం సరికాదు. నేను క్రికెట్ ఆడటం, విజయం సాధించడం వారికి నచ్చడం లేదు. బయట నా గురించి నెగెటివ్‌గా మాట్లాడుతున్నా సరే.. నాపై చర్చ జరుగుతున్నందుకు నేను సంతోషంగానే ఉన్నాను. వారిని ఏదైనా మాట్లాడుకోనివ్వండి' అని రహానే ఆవేదన వ్యక్తం చేశాడు.

# వైభవ్ సూర్యవంశీని చూసి నేర్చుకో పంత్..

## మైఖేల్ వాన్ సంచలన వ్యాఖ్యలు!

### రూ. 27 కోట్ల ఆటగాడిపై ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ విమర్శలు..

### టీమ్ ఇండియాలో చోటు దక్కాలంటే ఐపీఎల్‌లో చెలరేగాల్సిందే

**ఢిల్లీ:** ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ ప్రదర్శనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటు బ్యాటర్‌గా, ఇటు కెప్టెన్‌గా పంత్ తీవ్రంగా నిరాశపరుస్తున్న తరుణంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పంత్ తన ఆటతీరును మార్చుకోవాలని, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తరహాలో దూకుడు ప్రదర్శించాలని సూచించారు. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన పంత్, 9 బంతుల్లో కేవలం 7 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మెగా వేలంలో రూ. 27 కోట్లు పెట్టి కొనుగోలు చేసినప్పటికీ, పంత్ లక్నో జట్టును కనీసం ప్లే ఆఫ్స్‌కు కూడా చేర్చలేకపోయారని విమర్శలు వస్తున్నాయి. పంత్ నైపుణ్యంపై తనకు ఎటువంటి సందేహం లేదని, అతను ప్రపంచంలోని ఏ దేశానికైనా సులభంగా ప్రాతినిధ్యం వహించగల సామర్థ్యం ఉన్న ఆటగాడని వాన్ పేర్కొన్నారు. అయితే, టీమ్ ఇండియాలో చోటు దక్కించుకోవాలంటే మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుతం భారత జట్టులో ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, జితేష్ శర్మ వంటి వికెట్ కీపర్ల నుంచి పంత్‌కు తీవ్రమైన పోటీ ఎదురవుతోందని గుర్తు చేశారు. జాతీయ జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలంటే పంత్ ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇవ్వాలని వాన్ అభిప్రాయపడ్డారు. "పంత్ తన బ్యాటింగ్ స్థానాన్ని మార్చుకోవాలి. ఓపెనర్‌గా కాకుండా మూడో స్థానంలో వచ్చి, వైభవ్ సూర్యవంశీలా బంతిని మైదానం బయటకు పంపే ప్రయత్నం చేయాలి. తాను 48 బంతుల్లోనే సెంచరీ చేయగలననే ఆత్మవిశ్వాసంతో ఆడాలి" అని సూచించారు. ఐపీఎల్ ముగిసేలోపు పంత్ తన ఫామ్ పుంజుకోకపోతే టీమ్ ఇండియా భవిష్యత్తు ప్రణాళికల్లో అతని స్థానం ప్రశ్నార్థకం అయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.





# చెపాక్ కోటలో పంజాబ్ 'పంజా'

## చెన్నైకి సొంత గడ్డపై షాక్!

- ఐపీఎల్ ఏడో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ ఘన విజయం
- భారీ స్కోరును అవలీలగా ఛేదించిన పంజాబ్ బ్యాటర్లు
- మెరిసిన శ్రేయాస్ అయ్యర్, ప్రియాంశ్ ఆర్య
- వృథా అయిన ఆయుష్ మ్హాత్రే, శివమ్ దూబే శ్రమ



**చెన్నై:** ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన ఐపీఎల్ ఉత్కంఠభరిత పోరులో చెన్నై సూపర్ కింగ్స్ కు చేదు అనుభవం ఎదురైంది. భారీ స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ జట్టు ఐదు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై 209 పరుగుల భారీ స్కోరు సాధించినా.. పంజాబ్ బ్యాటర్ల సమష్టి కృషితో ఆ లక్ష్యం చిన్నబోయింది. ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ జట్టు విజయాన్ని ముద్దాడింది.

### చెన్నై ఇన్నింగ్స్ సాగిందిలా..

టాస్ గెలిచిన పంజాబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ కు దిగిన చెన్నై జట్టుకు ఆయుష్ మ్హాత్రే అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 43 బంతుల్లోనే 73 పరుగులు సాధించి పంజాబ్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే తనదైన శైలిలో సిక్సర్లతో చెలరేగాడు. 27 బంతుల్లో 45 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్ చివర్లో సర్ఫరాజ్ ఖాన్ పూనకం వచ్చినట్లు ఆడాడు. కేవలం 12 బంతుల్లోనే 32 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్ తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో చెన్నై నిర్ణీత ఇరవై ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరు సాధించింది. పంజాబ్ బౌలర్లలో విజయ్ కుమార్ వైశాక్ నాలుగు ఓవర్లలో 38 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. యుజ్వేంద్ర చాహల్ మూడు ఓవర్లలో 21 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా, మార్కో జాన్సెన్ భారీగా పరుగులు (4 ఓవర్లలో 43) సమర్పించుకుని ఒక వికెట్ తో సరిపెట్టుకున్నాడు.

### లక్ష్య ఛేదనలో పంజాబ్ పంజా..

210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్ 34 బంతుల్లో 43 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 29 బంతుల్లోనే 50 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే మ్యాచ్ ను పూర్తిగా పంజాబ్ వైపు తిప్పింది మాత్రం ప్రియాంశ్ ఆర్య. క్రీజులోకి రాగానే బౌండరీల వర్షం కురిపించిన ప్రియాంశ్.. కేవలం 11 బంతుల్లోనే 39 పరుగులు సాధించి చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ సుడిగాలి ఇన్నింగ్స్ తో పంజాబ్ పని మరింత సులువైంది. 18.4 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి 210 పరుగులు సాధించి ఘన విజయం సొంతం చేసుకుంది.

### తేలిపోయిన చెన్నై బౌలర్లు..


సొంత మైదానంలో భారీ స్కోరును కాపాడుకోవడంలో చెన్నై బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. పంజాబ్ బ్యాటర్లను కట్టడి చేయలేక చేతులెత్తేశారు. అన్షుల్ కాంబోజ్ 3.4 ఓవర్లలో 43 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. మ్యాట్ హెన్రీ ఏకంగా 54 పరుగులు సమర్పించుకుని రెండు వికెట్లు తీసుకున్నాడు. ఖలీల్ అహ్మద్ మూడు ఓవర్లలో 28 పరుగులిచ్చినా వికెట్ దక్కించుకోలేకపోయాడు. కచ్చితమైన లైన్ లెంగ్త్ తో బంతులు వేయకపోవడంతో పంజాబ్ సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకుంది. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ టోర్నీలో తమ ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుకోగా, సొంత గడ్డపై అభిమానుల మధ్య ఓడిపోవడం చెన్నైకి తీవ్ర నిరాశను మిగిల్చింది. తదుపరి మ్యాచ్ లలో బౌలింగ్ విభాగంపై చెన్నై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.





# ఆ ఒక్క కారణంతోనే ముంబైని వదిలేశా..

### ఇంటర్వ్యూలో టెండూల్కర్ షాకింగ్ కామెంట్..!



**ముంబై :** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో కొత్త జట్టుకు ఆడుతున్న ఆటగాళ్లలో అర్జున్ టెండూల్కర్ ఒకడు. దిగ్గజ క్రికెటర్ సచిన్ తనయుడిగా మనందరికీ సుపరిచితుడైన అర్జున్ ఈసారి తనకు మరిన్ని అవకాశాలు వస్తాయనే ఆశాభావంతో ఉన్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆడుతున్న ఈ పొడగరి ఆల్‌రౌండర్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని ఎందుకు వీడాల్సి వచ్చిందో చెప్పేశాడు. తాజాగా ఒక పాడ్‌కాస్ట్ షోలో మాట్లాడిన అర్జున్ బెంచ్ మీద ఉండడం ఇష్టం లేకనే ముంబైని వదిలేశానని చెప్పాడు. పంతొమ్మిదో సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కు ఆడుతున్న అర్జున్ టెండూల్కర్ ఈసారి తన ముద్ర వేయాలనుకుంటున్నాడు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఈ పొడగరి ఆల్‌రౌండర్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీని వీడడానికి దారి తీసిన కారణాలను వెల్లడించాడు. శుభంకర్ మిశ్రా పాడ్‌కాస్ట్‌లో తన మనసులోని మాటల్ని, బాధను వెళ్లగక్కాడీ యంగ్‌స్టర్. 'ముంబై ఇండియన్స్ తరఫున మీరు కొన్ని మ్యాచ్‌లు ఆడారు. మీ స్వింగ్ కూడా బాగుంది. మీకు మరిన్ని అవకాశాలు వస్తాయని ఊహించి ఉంటారు కదా? అని అడిగిన ప్రశ్నకు అర్జున్ ఏ ఆటగాడైనా సరే అలాగే అనుకుంటారు. ఎవరూ కూడా బెంచ్ మీద కూర్చోవాలని కోరుకోరు. అయితే.. అవకాశం వచ్చినప్పుడు బాగా కష్టపడి అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది' అని అర్జున్ తెలిపాడు. ఆది నుంచి వివాదాస్పదమవుతున్న ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై కూడా అర్జున్ తన అభిప్రాయం పంచుకున్నాడు. ఆల్‌రౌండర్ అయినందున ఈ నియమాన్ని వ్యక్తిగతంగా తాను వ్యతిరేకిస్తానని అతడు అన్నాడు. 'ఏ ఫార్మాట్‌లోనైనా పదకొండు మందిని ఎంచుకొని ఆడాల్సి ఉంటుంది. కానీ, ఐపీఎల్‌లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నియమం ఉంది. అంతర్జాతీయ టీ20ల్లో, ఇతర దేశాల లీగ్‌లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధన లేదు. ఈ నియమంతో ఆల్‌రౌండర్లకు అవకాశాలు రావడం లేదు. కాబట్టి.. వ్యక్తిగతంగా నేను ఈ నియమాన్ని వ్యతిరేకిస్తాను' అని అర్జున్ వెల్లడించాడు.

### 5 మ్యాచుల్లో 3 వికెట్లు

తొలి మ్యాచ్‌లో తమ జట్టు ఓటమిపై స్పందించిన అతడు .. లక్నో మిడిలార్డర్ పటిష్టంగా ఉందని, టీర్నో‌లో తాము పుంజుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇప్పటివరకూ 5 ఐపీఎల్ మ్యాచుల్లో అర్జున్ 3 వికెట్లు తీశాడంతే. అతడి అత్యుత్తమ ప్రదర్శన.. 1/9.




# ఆది కొత్త సినిమా సైరాబాను

## క్లాప్ కొట్టిన నటుడు కిరణ్ అబ్బవరం


టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ శుక్రవారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంఇతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.



## ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో..

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సం' తం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉ పశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.

# పాకెట్ నవల్ మూవీతో ఎంతో నేర్చుకున్నా




## నటి మాళవికా మోహనన్

ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉ పశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపురంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.




# ఓటీటీలోకి ఎస్ సరస్వతి మూవీ

ఓటీటీలోకి ఎస్ సరస్వతి మూవీ

వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ఎస్. సరస్వతి'. గత నెల మార్చి 6న థియేటర్లలో విడుదలై ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, జీవా, మురళీ శర్మ, రావు రమేశ్, రాధికా శరత్‌కుమార్ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. కథ విషయానికి వస్తే, లక్ష్మి అనే ఓ అనాథ మహిళ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ తన కూతురు 'ఎస్. సరస్వతి'ని ఎంతో ప్రేమగా పెంచుకుంటుంది. అయితే ఆగస్టు 15న తన కూతురిని స్కూల్లో దించి ఉద్యోగానికి వెళ్లిన లక్ష్మి.. ఆ తర్వాత తన కూతురు కనిపించడం లేదని, స్కూల్లోనే ఆమెపై అఘాయిత్యం జరిగిందని పోలీసులను ఆశ్రయిస్తుంది. పోలీసులు విచారించగా అసలు అలాంటి పాపే ఆ స్కూల్లో లేదని తేలడంతో కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఇంతకీ ఆ పాప ఏమైంది, లక్ష్మి చెబుతున్నది నిజమా లేక ఇదంతా ఆమె భ్రమా అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సస్పెన్స్ థ్రిల్లర్ సాగుతుంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు ఇప్పుడు నేరుగా ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

PRINTED, PUBLISHED AND OWNED BY **MOHAMMED IMRAN,** PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. **EDITOR : MOHAMMED IMRAN**, RNI. NO. **TELTEL/2006/16536**